

సంపుటము ౯] రాజమహేంద్రవరము : శా. శ. ౧౮౬౧ ఆషాఢం ౧౦ జూలై ౧౯౩౯ [౪ సంచిక

1939

వ్యాఖ్యానములు

ఆంధ్రమహాసభా — కాంగ్రెసేతరులూనూ

"ఆంధ్రమహాసభకి కాంగ్రెసేతరు లెందుకు రారూ?" అని బ్రహ్మశ్రీ గుమ్మిడిదల వేంకటసుబ్బారావుగారి ప్రశ్న.

ఎందుకు రావాలీ?

కాంగ్రెస్సాంధ్రులు జస్టిస్సువారి సభలకు వెళ్లరేం?

మితవాదుల సభలకు వెళ్లరేం?

హిందూమహాసభకున్నూ వెళ్లరేం?

అలాంటిదే యిదీన్నీ.

కాంగ్రెస్సాంధ్రుల సభకు కాంగ్రెసేతరులు వెళ్లడం సంభవం కాదు.

సబబున్నూ కాదు.

"నిజానికి, అప్పటికీ యిప్పటికీ, పూర్వవాసనలచేత ఆకాంగ్రెసువారే మహాసభకి దీహారాధన చేయిస్తున్నా"రని సుబ్బారావుగారు సంతోషిస్తున్నారు.

ఇది భ్రాంతి.

కాంగ్రెస్సాంధ్రులు దీహారాధన చెయ్యడం లేదు, దీపం ఆర్పేస్తున్నారు.

ఆర్పే వేశారు.

లేకపోతే ఆంధ్రమహాసభమీద కాంగ్రెస్సువారి వేలిముద్ర లెందుకు పడతాయి?

కాంగ్రెస్సాంధ్రులు విశుద్ధమైన తమ ఆంధ్రత్వాన్ని పురస్కరించుకుని ఆంధ్రమహాసభను నడపడం లేదు.

అసలు, వారి ఆంధ్రత్వమే విశుద్ధంగా లేదు.

కనకనే, వారు, ఆంధ్రత్వం కంటే భారతీయత్వమే తమకు ప్రధానం అని ఘంటాపథంగా చెబుతున్నారు.

కనకనే, వారు, స్వాయత్తమైన ఆంధ్రరాష్ట్రం కంటే పరాయత్తమైన స్వరాజ్యమే తమకి ప్రధానమని ఢంకామీద దెబ్బకొట్టి చెబుతున్నారు.

ఇంతేకాక.

ఆంధ్రమహాసభను కాంగ్రెసేతరుల చేతుల్లోకి పోనిస్తే, ఆంధ్రోద్యమమే తరణోపాయం అనుకునేవారు దాని సర్వశక్తులనూ ఆంధ్రరాష్ట్రనిర్మాణప్రయత్నాలలోనే కేంద్రీకరిస్తారనీ, తద్వారా దేశీయులలో, ఆంధ్రరాష్ట్రవాంఛ బలపడిపోతుందనీ, తన్మూలంగా ఆంధ్రరాష్ట్రనిర్మాణప్రయత్నాలకు గర్భశత్రువులైన కాంగ్రెస్సునియంతలమీద ద్వేషమున్నూ ప్రబలిపోతుందనీ, ఆకారణంవల్ల గుడ్డిగా ఆనియంతలకు పాదపూజలు చేసే తమకి తమ మాతృదేశంలో నామరూపాలు

లేకుండాపోతాయనీ ఈవుద్దేశంవల్లనే కాంగ్రెస్ఆంధ్రులు దాన్ని చేజిక్కించుకుని వున్నారు; కాని తామున్నూ ఆంధ్రులైనందుకు దానియెడల తమకేర్పడివున్న బాధ్యతను నిర్వహించుకోడానికి కాదు.

ఈసంగతి సుబ్బారావుగారు గ్రహించివుండరనుకోవాలా మేము?

ఇలాంటి దురూహాలే లేకపోతే, కాంగ్రెస్ఆంధ్రులు, ఆంధ్రమహాసభలో పాక్షికవిధం తెచ్చెందుకు ప్రవేశపెడతారూ?

కాకినాడలో జరిగిన ఆంధ్రమహాసభకి, ఆహ్వాన సంఘంలో బాధ్యత గలవారు, శ్రీభూపతిరాజు సీతారామ రాజుగారిని అధ్యక్షతకు ఆహ్వానించా లనుకుంటే, వారు కాంగ్రెస్సేతరు లనే కారణంతో నిషేధించి, సాంబమూర్తిగారు, ఆపదవి రామదాసుపంతులుగారి కిప్పించడం సుబ్బారావుగా రెరుగుదురా?

తరవాత నాలుగు మాసా లయినా కాకుండానే కాకినాడ చేరువగా వున్న కొత్తపల్లిలో జరిగిన ఆంధ్రమహాసభకి, ఆహ్వానసంఘంలో ప్రముఖులైనవారు, జనాబ్ ఉమూర్ అలీషా కవిగారిని అధ్యక్షస్థానంలో అభిషేకించా లనుకుంటే, వారున్నూ కాంగ్రెస్సేతరు లనే కారణం చూపి ప్రతిఘటించి, నరసింహదేవర సత్యనారాయణగారు ఆపదవి మళ్లీ రామదాసుపంతులుగారికే యిప్పించడం కూడా సుబ్బారావుగా రెరుగుదురా?

"౧౯౩౭ చెన్నపురి సభలో వచ్చిన ౨౬౦ మంది ప్రతినిధులలోను, ఏపదిహేనుగురో మాత్రమే కాంగ్రెస్సేతరు లనుకొంటాను. ఎందుకు రారు ఈహేమాహేమీ లంతాను? అధ్యక్షుడు సర్. రాధాకృష్ణయ్యగారు, ఆహ్వానసంఘాధ్యక్షుడు వావిళ్ల, సభాప్రారంభకులు సర్. ముత్తా—వీరంతా కాంగ్రెస్సేతరులే" అంటున్నారు సుబ్బారావుగారు!

కావచ్చు.

కాని, వీరందరూ సాంబమూర్తిగారివల్ల నామినేటు చెయ్యబడ్డవారే కాని, ఆహ్వానసంఘంవల్ల శాస్త్రీయంగా ఎన్నుకోబడ్డవారు కారని సుబ్బారావుగా రెరుగుదురా?

అధ్యక్షుల పక్కన కూచుని, వారిని స్వాతంత్రించనియ్యక, కార్యక్రమం అంతా సాంబమూర్తిగారే నడిపివుండడం సుబ్బారావుగారు చూశారా?

ఆసభకి సంబంధించిన విందుకి సర్. రెడ్డినాయుడుగారిని పిలవడం బుద్ధిపూర్వకంగా మానేశారనే సంగతి సుబ్బారావుగా రెరుగుదురా?

"౧౯౩౮ లో (బెజవాడలో) కోటిరెడ్డిగారు స్థాయి సంఘంలో ప్రతీజిల్లానుంచీ, కాంగ్రెస్సేతరప్రముఖులను బహుమందిని సభ్యులుగా నియమించారు. కాని యేమీ లాటింగు చూచినా నేనొక్కడనే మాజరయ్యే "కాంగ్రెస్సేతరుణ్ణి" అనిన్నీ అంటున్నారు సుబ్బారావుగారు.

"ఎంచేతా?" అని ఆలోచించకుండా సుబ్బారావుగా రిలా అనడం బాగా లేదు.

కోటిరెడ్డిగారు కాంగ్రెస్సేతరులు కారే?

వారయినా పట్టాభిగారివల్ల నామినేటు చెయ్యబడ్డవారే; కాని ఆహ్వానసంఘంవల్ల సక్రమంగా ఎన్నుకోబడ్డవారు కారే?

సభానిర్వహణంలో అయినా వారికి స్వాతంత్ర్యం లేకపోయిందే?

సర్వానికీ తామే అయి పట్టాభిగారు, సుబ్బారావుగారిని ఏవిధంగానూ చేరనివ్వలేదే?

ఇక స్థాయి సంఘసభ్యులను కోటిరెడ్డిగారే నియమించారని నమ్మడం యెలాగా?

కాంగ్రెస్సేతరు లంటే యేకారణంవల్లనో పావలా చెల్లించి పట్టా పుచ్చుకోలేక—అయినా కాంగ్రెస్ఆంధ్రులను ఆశ్రయించుకుని తిరిగేవారే కారని సుబ్బారావుగా రంగీకరిస్తారనే నమ్ముతున్నాము.

అయితే, కోటిరెడ్డిగారు నియమించిన సభ్యులలో స్వతంత్రు లెందరో సుబ్బారావుగారు పరిశీలించారా?

వారిలో ప్రజాహితకార్యాలలో పాల్గొనేవా రెందరో కూడా సుబ్బాగారు పరిశోధించిరా?

పోనీ,

ఆంధ్రులకందరికీ మాతృక్షోసం కాబగిన ఆంధ్రమహాసభలో, శ్రీమతి అమ్మన్నరాజాగారిచేత, ఒక్క కాంగ్రె

స్వపక్షానికి మాత్రమే చెందిన రాటపుజెండా యెగర వేయించడం కాంగ్రెస్సేతరులు సహించలేరని సుబ్బారావుగారు వూహించలేరూ?

బంగాళీల వందేమాతరం పాట పాడించడం కూడా అలాంటిదే అని వారు గ్రహించలేరూ?

అయినా కాంగ్రెస్సేతరులు ఆంధ్రమహాసభకి రావాలనే అంటారా వారు!

కోటిరెడ్డిగారిని గద్దె యెక్కించిన కాంగ్రెస్సాంధ్రులు రామచంద్రారెడ్డిగారిని మరోసభలో గద్దె యెక్కిస్తారా?

రాధాకృష్ణయ్యపంతులుగారిని అధ్యక్షతకు పిలిచిన కాంగ్రెస్సాంధ్రులు, మరోసభకి రెడ్డినాయడుగారిని పిలిచి సభను నిర్వహిస్తారా?

ఆహ్వానసంఘం యేర్పడకుండానే విశ్వేశ్వరయ్యగారిని అధ్యక్షతకు పిలిచిన కాంగ్రెస్సాంధ్రులు, మరో సభకి రాఘవేంద్రరావుగారిని పిలుస్తారా?

గుమ్మిడిదల వెంకటసుబ్బారావుగారిని కాంగ్రెసాంధ్రులు దరికైనా రానివ్వరని మేము గట్టిగా చెప్పగలం.

పోనీ, యీకాంగ్రెస్సాంధ్రులు తాపీ ధర్మారావు నాయుడుగారిని—పండంగి కేశవరావుపంతులుగారిని—త్రిపురనేని రామస్వామిచౌదరిగారిని అధ్యక్షతకు పిలిచి గౌరవించగలరని సుబ్బారావుగారు చెప్పగలరా?

ఆంధ్రమహాసభ పాతికే సంవత్సరాల పడుచే.

అయితే యేమి లాభమూ?

యీభైయేళ్ల కాంగ్రెస్సునే పాక్షికసంస్థగా చేసేసిన వారు పాతికసంవత్సరాల ఆంధ్రమహాసభని అందరికీ చెందనిస్తారా?

ఇంతకీ:

కాంగ్రెస్సేతరులు ఆంధ్రమహాసభకి రాకపోతే యేం పోయింది?

ఆంధ్రరాష్ట్రం తీసుకురాగలవారెవరైనా వుంటే వారు రద్దుకోరే!

అప్పట్నుంచీ ఆంధ్రమహాసభకి దీపారాధన చేస్తున్న కాంగ్రెస్సాంధ్రులు రాష్ట్రం సంపాదించలేకపోయారే!

అసలు రాష్ట్రసంపాదనకు వారు సుముఖులే కానట్టు కనపడుతున్నదే?

అలాంటి కాంగ్రెస్సాంధ్రులతో సాహచర్యానికి వొప్పుకోకపోతే కాంగ్రెస్సేతరులు నిందాపాత్రులేనా?

సుబ్బారావుగారి యీప్రశ్న చాలా వింతగా వున్నది.

తమ తప్పు తెలుసుకుని ఆంధ్రమహాసభతో సంబంధం వదలించుకోవలసిన సుబ్బారావుగారే ఆంధ్రమహాసభకి దూరంగా వున్నారని తక్కిన కాంగ్రెస్సేతరులను నెపపెట్టడం చాలా ఆశ్చర్యకరంగా వున్నది.

పద్ధెనిమిది మాసాల్లో నిమ్మపండు వాటం

పబ్లిక్ వర్క్సు మంత్రి యాకూబు హుస్సేనుగారు, బళ్లారిలో, (జూన్ ౨౨) పద్ధెనిమిది మాసాల్లో తుంగభద్ర ప్రాజెక్టు ప్రారంభించబోతున్నామని నిండు సభలో చెప్పారు.

మండుటెండలు తగ్గి యేదో విధంగా చల్లబడ్డ యీ రోజుల్లో హుస్సేనుమంత్రిగారు ఇలాంటి చల్లని మాట చెప్పడం వుచితంగానే వుంది.

చాలా సంతోషం.

నిజంగా, హుస్సేనుమంత్రిగారిది అమోఘవాగ్దానం.

ఎప్పటికీ వారు ఒక్కమాటమీదే నిలిచి వుంటారు.

ఇక్కడి తోగ్రిగడ్డ ప్రాజెక్టుసంబంధంలో వారి సంగతి మాకు బాగా అనుభవమే.

రాయలసీమ—తోగ్రిగడ్డ—వీటికి సామీప్యం లేకపోయినా సారూప్యం మాత్రం వుంది.

ఎలాగంటే?

నీటివసరులు లేక రాయలసీమ యెండిపోతున్నది.

నీటి ముంపువల్ల తోగ్రిగడ్డప్రాంతం మురిగిపోతున్నది.

ఈసారూప్యం—లేక—సామ్యం యింకొక విధంగా కూడా చూపించవచ్చు.

రాయలసీమ రైతులకు పండుతుందన్న ఆశ లేదు.

తోగ్రిగడ్డ రైతులకు పంట తక్కుతుందన్న ఆశలేదు.

చివరికి, యిలాగ, వొక విధమైన స్థితిలోనే వున్న వుభయప్రాంతాల రైతులకూ హుస్సేనుమంత్రిగారు

ఒకటే విధమైన వాగ్దానం చెయ్యడం చాలా సరసంగా వున్నది.

కాని, తోట్రిగడ్డ ప్రాజెక్టు వొకటి రెండు లక్షల పని.

తుంగభద్ర ప్రాజెక్టు యేడెడినిమిది కోట్ల పని.

అయితే యేం?

అన్నింటిలో సామ్యం వచ్చినప్పుడు ఈప్రాజెక్టులకు ఈవిషయాన్ని బట్టి మాత్రం సామ్యం యెందుకుండదూ?

ఉండకపోవడానికి వీలా?

పైగా, అధికారు లయినవారు సమవర్తు లయి వుండాలి కదా?

పోగా,

ఇక మనం పరిశీలించవలసింది వొక్క కాలం విషయమే.

ఈ పబ్లిక్‌వర్క్సు మంత్రిగారు, తోట్రిగడ్డ ప్రాజెక్టు విషయంలో సంవత్సరం సంవత్సరం చొప్పున వరాసగా రెండు సమానవాయిదాలు వేశారు.

కాని మొన్నటి కొత్తపన్నుల సందర్భంలో, వారు, అక్టోబరులో యేర్పాట్లు జరగవచ్చు నన్నారు.

అంటే?

తోట్రిగడ్డకి సంబంధించిన మూడో వాయిదా ఆరు మాసాలలో పడిపోయింది.

కాని, కాలం చాలా విలవ అయినది.

దాన్ని వ్యర్థంగా పోనివ్వడం తెలివైన పనికాదు.

వాయిదాలు వెయ్యడంలో గాంధిగారు అతి చతురులు గదా? ఇక వారి అనుచరులా ఆవిషయంలో పొరబాటు పడతారు?

కనక?

పబ్లిక్‌వర్క్సుమంత్రిగారు తోట్రిగడ్డలో మిగిలిపోయిన ఆరుమాసాలూ తుంగభద్రలో కలిపారు.

అంచేతే ఆలెక్క పద్ధెనిమిది మాసాలు వచ్చినవి.

దీనివల్ల యేమి తేలుతున్నదీ?

రాబోయే బడ్జెట్టుతో తోట్రిగడ్డ పని ఫైసలా.

ఆపైని రాబోయే బడ్జెట్టుతో తుంగభద్ర పని ఫైసలా.

ఇలాగ రెండు బడ్జెట్టులు వరసగా ఆంధ్రమండలాలకు భుక్తం అవుతాయి.

ఎంత అదృష్టమూ?

మొన్న మొన్న బొంబాయిలో కూడిన కాంగ్రెస్సు కమిటీకూడా ఆంధ్రరాష్ట్రనిర్మాణం తొరగా జరగవలసిం దని ఘూ___ట్టిగా నమ్మేసింది.

ఎన్నాళ్లకి ఆంధ్రుల రేఖ బయట పడ్డదీ?

అయితే,

తుంగభద్ర ప్రోజెక్టుకి సంబంధించిన పబ్లిక్‌వర్క్సు మంత్రిగారి వాగ్దానంలో వుండుకున్న గంభీరమైన ధ్వని అలాగ అచుంబితంగానే వుండిపోయింది.

దాన్ని వివరించండీ వ్యాఖ్యానం అంటే యేమిటీ?

కాంగ్రెస్సు ప్రభుత్వం యిప్పటికి మూడు బడ్జెట్టులు వేసుకున్నది.

పబ్లిక్‌వర్క్సుమంత్రిగారు తుంగభద్రకోసం కేటాయించి వుంచిన పద్ధెనిమిది మాసాల్లోనూ మరో రెండు బడ్జెట్టులు వేసుకుంటుంది.

వాటితో మొత్తం బడ్జెట్టులు అయిదవుతాయి.

కొత్త రాజ్యాంగశాసనా న్ననుసరించి రాష్ట్రీయ ప్రభుత్వాల ఆయుర్దాయం ఎప్పటి కప్పుడే అయిదేసి సంవత్సరాలు.

కనక తుంగభద్ర ప్రాజక్టు విషయం అయిదో బడ్జెట్టులో పడవచ్చును.

రాయలసీమవారిని విడదీసి వుంచవలసిన అగత్యం అత్యధికంగా వున్నది కనక తప్పకుండా పడితీరవచ్చును.

అంటే?

కాంగ్రెస్సు ప్రభుత్వం అవసానమూ, తుంగభద్ర ప్రాజక్టు ప్రారంభమూ ఏకకాలంలో జరుగుతా యన్నమాట.

బాగుంది.

గుజరాతీమిల్లుల కోసమే ఖద్దరుద్యమం

"ఎంతవరకు (నేను) ను యంత్రపరిశ్రమలను—ప్రధానమైన వానిని ప్రభుత్వమే నడుపవలె ననిన జాలదు. గృహపరిశ్రమ లభివృద్ధి కావలెను. అందులో ఖద్దరునకు ప్రాముఖ్య మీయవలెను. దానితో వచ్చెడి విప్లవము బ్రహ్మాండ మైన దని రాయివంటి రాడికలువాదులకు తెలియకపోవచ్చును. ఖద్దరు ఉద్యమముతో లాంకషైరు గగ్గోలు పెట్టిన రోజులు వారికి తెలియకపోవచ్చును"

—౨౮–౬–౩౯ ఆంధ్రపత్రిక

లాంకషైరు గగ్గోలు పడిపోయిన రోజులు రాయి గారూ యెరుగుదురు.

తక్కిన అందరున్నూ యెరుగుదురు.

అది యిప్పటికీ గోలపెడుతూనే వున్నది.

మరికొన్నాళ్లు కూడా అది గోలపెడుతూనే వుంటుంది.

కారణం?

ఖద్దరు ఉద్యమం కాదు.

ఎంతమాత్రమూ కాదు.

మన భారతీయుల స్వదేశీయ వస్త్రధారణదీక్ష వొక్కటే అందుకు కారణం.

విజ్ఞానం ప్రబలనప్పుడు ప్రపంచం అంతా ఖద్దరుతోనే కాలం గడిపింది.

అంటే యేమన్నమాట!

ఖద్దరు అనాగరికతకు గుర్తు.

అజ్ఞానానికి చిహ్నం.

మౌర్ఖ్యానికీ, మాంధ్యానికీ సాక్ష్యం.

ప్రకృతి బోధపడుతున్నకొద్దీ ప్రపంచంలో అనేకాభివృద్ధులు కలిగాయి.

మానవజీవితానికి అనేక సౌకర్యా లేర్పడినవి.

వాటిలో బట్టలమిల్లు వొకటి.

నవీనసాధనా లన్నీ వుపయోగించుకుంటున్న మనం బట్టలమిల్లు అంటే వులిక్కిపడడం అవివేకం.

ఖద్దరులో జీవం లేదు.

ఉంటే ఖండాంతరాల మిల్లుబట్టల పోటీలో అది యెందుకు కూలిపోయి వుంటుందీ?

యూరోపియనుల ప్రవృత్తి చూశాక అయినా మన వారు యాంత్రికపరిశ్రమలు ప్రారంభించి వుంటే మనకీ గతి వచ్చి వుండేదేనా?

యంత్రాలంటే అప్పు డశ్రద్ధ చేసినందుకే సిగ్గుపడవలసి వుండగా, ప్రపంచం అంతటా యాంత్రికపరిశ్రమలే అల్లుకుపోయి వున్న యీరోజుల్లో కూడా మనం రాట్నం తిప్పడమా!

చేతినే నమ్ముకోడంవల్ల పారిశ్రామికంగానే కాదు, సర్వవిధాలా మనం అధమస్థితికి వచ్చేశాం.

విదేశీయులూ, ఖండాంతరీయులూ మారణయంత్రాలతో దండెత్తివస్తే మన పూర్వులు విల్లమ్ములతోటీ, పట్టాకత్తులతోటీ యెదుర్కున్నారు.

ఫలితం?

ఎదటబడితే మనవాళ్లు అసాధ్యులే కావచ్చు; కాని శత్రువులు యెదటే పడలేదే?

మనవారితో పోరాడినవి మారణయంత్రాలు కాని మనుష్యులు కారే?

కత్తి యెదట కర్ర యేమి చెయ్యగలదూ?

తుపాకి యెదట కత్తి యేమి చెయ్యగలదూ?

ఫిరంగి యెదట తుపాకి యేం పనికి వస్తుందీ?

బాంబు యెదట ఫిరంగికి నామరూపా లుంటాయా?

విషవాయువుల యెదట బాంబుల శక్తి యేపాటిదీ?

ముఖాముఖీ యెదుర్కుని, బాహాబాహీ పోరాడి వుంటే ఇటాలియనులు యిథియోపియనులను జయించగలిగి వుండురా?

గాలివోడలతో ఖండాంతరా లన్నీ తిరిగి మన పూర్వులు ఆరోజుల్లో భలే వర్తకం సాగించి వుండినారు.

మరి మనం?

ఇలాగ యెటు చూసినా యంత్రాల యెదట చేతులు నిరర్థకా లయి వున్నాయి.

చేతిపనులే మన దరిద్రానికి కారణం అయినవి.

బాహుబలమే మన బానిసత్వానికి హేతువైనది.

కాంగ్రెస్సు నియంతలు నేకులు విమానాలలో సంచారం చేస్తున్నారు.

ఖద్దరేమను రాయబారాలకోసం సీమకి యెప్పుడు వెళ్ళినా బూలాబాయిగారు విమానమే యెక్కుతున్నారు.

ఏం, కాంగ్రెస్సు సమావేశాల్లో పూరేగింపులకే, గాని వారికి, ప్రయాణాలకు ఎడ్లబళ్లు పనికిరావ్వా ?

కాంగ్రెస్సు వ్యామోహంలో పడి, గాంధిగారి సంకల్పం గుర్తించుకోలేక, ఖద్దరు ఖద్దరంటూ ధర్మోపదేశాలు చెయ్యడంలో ఔచిత్యం లేదు.

తైలాదులు పూసి, వైద్యులు, శవాలను కుళ్లిపోకుండా నిలపగలిగే ట్టు, అభూతకల్పనలు చేసి గాంధిగారు ఖద్దరును నిలపగలుగుతున్నారు.

దాని కేనా వారు కోరుకున్న ప్రయోజనం గుజరాతీల బట్టలమిల్లులకు గిరాకీ తగలడం తప్ప మరేమీ కాదు.

కనక, ఎప్పటి కేనా మనం బాగు పడా లనుకుంటే వెంటనే దిద్దుకోవలసిన దురాచారం ఖద్దరుధారణ.

అది నెరవేరా లంటే ముందు మనం పూనవలసిన శపథం అహమ్మదాబాదు, బొంబాయి మిల్లుబట్టల బహిష్కారం.

ఏ. ఐ. సి. సి. దృఢాభిప్రాయం

“ ప్రత్యేకాంధ్ర రాష్ట్రము ఏర్పాటు చేయుటకు వెంటనే తగుచర్య గైకొనవలె నని అఖిలభారత కాంగ్రెస్సు సంఘమువారు దృఢాభిప్రాయము గలిగియున్నారు ” ట.

రాయబారులను యద్దేవా చేసిన కాంగ్రెస్సు నియంతలు ఈస్థితికి రావడం ఆశ్చర్యకరమే.

నిజంగా, యిది వెనకడుగు వెయ్యడమే.

సందేహం లేదు.

అయితే, యిది యింకా ముందుకి వురకడానికా, చప్పచప్పగా లొంగిపోవడానికా ?

ఈతీర్మానం అర్థం చేసుకోగలిగితే యిది లెస్సగా బోధపడుతుంది.

కనక కొంచెం ప్రయత్నింతాం.

రాజగోపాలాచారి మంత్రివర్గం మద్రాసురాష్ట్రం నాలుగు చెక్కలు చెయ్యవలసిం దని యిదివరకే తీర్మానించి వున్నది.

దానికి సంబంధం లేకుండా, ముందు ఆంధ్రరాష్ట్ర నిర్మాణం సాగించవలసిం దని ఇండియామంత్రికి రాజగోపాలాచారిగారు సిఫారసు చేసి వున్నారు.

“ఇప్పుడు కాదు” అని దానికి ఇండియామంత్రి జవాబు వచ్చి వున్నది.

వ్యవహారం యీస్థితిలో వుండగా కాంగ్రెస్సు కమిటీ యీతీర్మానం చేసింది.

ఈస్థితిలో యింత దృఢంగా అభిప్రాయపడడానికి కాంగ్రెస్సు సంఘాని కేమి అగత్యం వచ్చింది ?

మద్రాసుమంత్రివర్గం తన ఆజ్ఞను సరిగా నెరవేర్చక పోవడం కాంగ్రెస్సు గుర్తించిందా ?

అయితే, మందలించదేం ?

ఇండియామంత్రి కాంగ్రెస్సు నిశ్చయం తిరస్కరించాడా ?

అయితే, “ ఏం చెబుతా ”వని నిక్కచ్చి చెయ్యదేం ?

కాంగ్రెస్సు అభిప్రాయంలో వున్న దార్ఢ్యంయేమిటి ?

ఏమంచ.

ఎవ రీ చర్య గైకొనవలసినవారు ?

వర్కింగు కమిటీవారు కారు.

అయే వుంటే “ యీతీర్మానమును అమలు జరుపుటకు వెంటనే వర్కింగు కమిటీవారు చర్య గైకొనవలె ” నన్న సిధ్వాగారి సవరణ తిరస్కరించబడి వుండదు.

కాగా, మన మద్రాసు మంత్రివర్గమున్నూ కాదు.

అయి వుంటే ఆమాట చేర్చబడే వుండును.

పైగా, “అప్పు తీర్చేవాడికీ, యెగబెట్టేవాడికీ గూడా పత్రంతో పని లే ” దన్నట్టు, రాజగోపాలాచారిగారికి, చెయ్యదలచుకున్న పనికి కాంగ్రెస్సు తీర్మానం లేకపోయినా యిబ్బంది లేదు. చెయ్యగూడ దనుకున్న పనికి కాంగ్రెస్సు తీర్మానం వుండినా భయం లేదు.

ఏమంటే ?

ఉత్తరహిందూదేశానికి సంబంధించి వుంటేనే ఆచారిగారు కాంగ్రెసు తీర్మానానికి బద్ధులవుతారు. మద్రాసు ప్రెసిడెన్సీ విషయంలో అయితే ఆచారిగారి ఆజ్ఞకి కాంగ్రెస్సే బద్ధమయి వుండాలి.

పోగా, కాంగ్రెస్సు తీర్మానాలను అసలు జరపవలసిన బాధ్యత వర్కింగు కమిటీది. కాంగ్రెస్సు సంఘానిది కాదు. కనక అది తనకి కూడా కర్తృత్వం నిర్దేశించుకోలేదు.

పోనీ, యిది బ్రిటిషుపార్లమెంటు కన్వాయిస్తుం దనుకుందామా ?

శాస్త్రం చెప్పిన ట్టుంటుంది.

వ్యక్త్యభిప్రాయాలు——సొంత అభిప్రాయాలు అయితేనే తప్ప, కాంగ్రెస్సు తీర్మానా లంటే కాంగ్రెస్సు నియంతలకే లెక్కా జమా లేదు కదా, యిక బ్రిటిషు వారా వాటిని చూసి భయపడతారు ?

ఇలాంటి మూకఉమ్మడి తీర్మానాలను, వారే కాదు, మెదడు వున్నవా రెవరైనా తాకనైనా తాకుతారా ?

కాని, కాంగ్రెస్సాంధ్రులకు, దీంతోటే ఆంధ్రరాష్ట్రం వచ్చేసినంత పని అయిపోయింది.

దీనిమీద కాళేశ్వరరావుగారొక స్టేటుమెంటు. విశ్వనాథంగారొక స్టేటుమెంటు. తిరుమలరావుగారున్నూ వొక స్టేటుమెంటూ సవరణానూ.

ఇంకా అనేకు లనేక స్టేటుమెంట్లు.

కాని వాటిలో ఏ రెండింటికీ సమన్వయం కుదరదు.

అసలు, తీర్మానమే, వారికి, మనిషి కొక విధంగా అర్థం అయింది.

మద్రాసుమంత్రివర్గానికి మరొక విధంగా అర్థం అయి వుంటుంది.

ఇది యింతటితో ఆగిపోతే వొక మేలే.

కాని, కాంగ్రెస్సు సెక్రటరీ, యీపాటికి, చెటకారంగా నవ్వుకుంటూ మినిట్సు పుస్తకంలో దీనిమీద బండగీతలు గీసేసే వుంటా డని మానమ్మకం.

యూరపియనుల ముఖ్యావశ్యకాలు

ఇండియన్ గవర్నమెంటులో పని చేస్తున్న యూరపియన్ ఆఫీసర్లలో చాలా మందికి, సిమ్లా కొండలకు వెళ్లకుండా, వేసవిలో కూడా ఢిల్లీలోనే వుండిపోవా లంటే ఆక్షేపణ యెంతమాత్రమూ లేదుట.

అయితే,

ఇదివరలోనే వున్నవి కాక, ఢిల్లీలో, మరికొన్ని సౌకర్యాలు మాత్రం తమకి అదనంగా సమకూర్చా లంటున్నారు వారు.

వాటిలో ప్రధాన మైనవి, రెండు "స్విమ్మింగు పూల్సు"

అంటే,

ఈతా లాడడానికి సిమ్మెంటుతో తయారు చేసిన రెండు తటాకాలు.

"వోస్" అనిపిస్తుంది మనకి.

కాని, వారికి, కాంతాకనకాల కంటేనూ యివీ, యిలాంటివీ యెక్కువ ప్రీతిపాత్రాలు.

నిజంగా, ఆలోచించి చూస్తే, యిలాంటి సౌకర్యాలకు వినియోగపడని కనకం వుండి యేమి ప్రయోజనమూ ?

ఇలాంటి సౌకర్యాలు అక్కర్లేని జీవితానికి, పశుకృత్యానికే కాక, మరి కాంతలు మాత్రం యెందుకూ ?

వారిలో స్త్రీలూ, పురుషులూ—పిన్నలూ, పెద్దలూ, వృద్ధులూ—చివరికి గర్భిణీస్త్రీలు కూడా మహోల్లాసంతో యీతా లాడతారు.

వందల అడుగుల యెత్తునుంచి కూడా ఆతటాకాలలో దుమికి—ఆశ్చర్యాధీను లయి వుండిన్నీ ఘరికి, బలజంతువులకంటేనూ లాఘవంగా వారు యీతా లాడతారు.

వారు, యీత కొట్టాటప్పుడు ధరించే దుస్తులే వేరు.

వారికి అనేకరకాల యీత సాధనాలున్నూ వున్నవి.

అవి వేలకొద్దీ ఖరీదు చేస్తవి.

ఒక్కొక్క చెరువు నిర్మించడానికి, వారు, లక్షలకు లక్షలు గుమ్మరించేస్తారు.

దానికి ప్రయోజనం ? కోట్ల విలవ గల ఆరోగ్యభాగ్యం.

దానికి ఫలితం ? అర్బుదాల విలువ చేసే సౌందర్యం.

ఇక చెప్పవలసిం దేమున్నది ?

ఉక్కుతీగా, మెరుపూ కలిస్తే గప్పున, ప్రకాశమాన మైన దీపం ఆవిర్భవించేటట్టు, ఆరోగ్యమూ, సౌందర్యమూ మిళితం అయితే మహోజ్వల మైన ఉల్లాసం పొటమరిస్తుంది.

అది అనంతలీలావిలాసాలు అంకురింపచేస్తుంది.

వాటివల్ల స్వర్గసౌఖ్యం, దానివల్ల బ్రహ్మానందానుభూతి.

సెబాస్ !

ఏమి జీవితమూ !

ఏమి జన్మ !

మరి మనం ?

ఈశ్వరసృష్టిలో ప్రపంచం అంతటా యేమున్నదో మన దేశంలోనూ అది వున్నది.

యూరపియనుల కెంత సూక్ష్మమైన బుద్ధి వున్నదో మనకీ అంత సూక్ష్మమైన బుద్ధి వున్నది.

ఇక్కడా వేలకొద్ది తటాకాలున్నవి.

వందలకొద్దీ నదులున్నవి.

బ్రహ్మాండమైన సముద్రతీరం వున్నది.

కాని స్నానార్థమైనా మనవారు నీటిలో సాచి అడుగు వెయ్యరు.

వేస్తే వొక్కటే మునగ.

ఈదడం అంటూ వస్తే ఆడవాళ్ల మధ్య.

యువకుల సంగతే యింత అందంగా వున్నప్పుడిక స్త్రీల సంగతి చెప్పడాని కేమి వున్నదీ ?

నౌకావిహార మయినా మనవాళ్లెరగరు.

"నదీం తరేన్న బాహుభ్యాం" అని మనకి ధర్మపన్నాలు.

సముద్రయానం చెయ్యగూడ దని మనకి నిషేధం.

ఇక ఖండాంతరాలతో మన కెక్కడి వాణిజ్యమూ !

సముద్రాలకు సముద్రాలు విడిచేతులతోటే దాటివెయ్యగల పాశ్చాత్యులను మన మేమి ప్రతిఘటించగలమూ !

నిజానికి, "స్విమ్మింగు పూ" లంటే, సముద్రం యెదుట వొక్క నీటిచుక్క అయినా కాదు.

కాని, దానిని పూర్తిగా వినియోగపరుచుకోగలవాడికి, దాని యెదుట, మహాసముద్రమే నీటి చుక్క అయిపోతుంది.

అందుకోసం స్విమ్మింగు పూలు.

నీ రంటే ప్రాణాపాయకర మైన దని కాక, మనిషికి వొక విలాసవస్తువు—వొక వినిమయం—అని తోపింప చెయ్యడానికి స్విమ్మింగు పూలు.

ఈసంగతి యూరపియనులకు బాగా తెలుసు.

మన పక్కని వున్న జపానువారికిన్నీ తెలుసు.

కాని మనకి ?

యూరపియను లేం చేస్తున్నారో మనం చూడం.

ఎందుకు చేస్తున్నారో మనం యోచించం.

ఏమి ఫలితా లనుభవిస్తున్నారో మనం తెలుసుకోం.

మనది ఆధ్యాత్మికదృష్టి ట.

అదే మన ప్రత్యేకత ట.

నిజమే. అదిచేతనే మన కీ బానిసతనం.

మా అప్పన్న శాస్త్రి

నల్లఘైర్ముల్లయినా నిండలేదు.

చెయ్యవలసిందీ, అనుభవించవలసిందీ యెంతో వుంది.

కాని, మా అప్పన్నశాస్త్రి ౨౫—౬—౩౯ తేదీని హఠాత్తుగా అకాలమృత్యువు వాత పడ్డాడు.

మా పెద్దమేనమామగారి పెద్దకొడుకు. నా భార్య పెద్దతమ్ముడు. దివంగతులైన నాదేండ్ల కృష్ణ సుహాలక్ష్మికి "మల్లికార్జునరావు" అనే తన మొదటి నవల అంకితం చేసిన వుదారుడు.

మా అప్పన్నశాస్త్రి మమ్మల్ని విడిచి వెళ్ళిపోయాడు.

అయిదు రోజుల జ్వరం. అదయినా యింటికి తెలియపరచవలసినంతగా వుండలేదు.

పాతికేళ్లు నిండని భార్యా, యెనిమిదేళ్లు నిండని యిద్దరు కూతుళ్లూ, మైనారిటీ వొదలని చిన్ని తమ్ముడూ దగ్గిరే గాఢనిద్రలో వున్నారు; కాని యేమి బాధపడ్డాడో, యేమి పరితపించాడో, యేమి చెప్పదలుచుకున్నాడో, యేమి జరిగిందో, పరిచారకులకు సహజమైన ఆందోళనతో వులిక్కిపడి లేచి చూశాటప్పటికి విగతజీవుడై వుండినాడు.

వరంగల్లునుంచి కరీంనగరుకి లాగే—వారం అయినా తిరక్కుండా—సుఖనిద్రలోనుంచి పెద్దనిద్రలోకి బదిలీ అయిపోయాడు.

ఇంగ్లీషులో అండరుగ్రాడ్యుయేటు. సంస్కృతాంధ్రాలలో విద్వాన్. ఉర్దూలో మున్షి. చారిత్రికపరిశోధకుడు. గ్రంథకర్త. పత్రికాసంపాదకుడు. కాలేజీ పండితుడు.

కాదగినవాడు. కాగలవాడు.

కాని ఆయుర్దాయం వొక్కటే తక్కువయిపోయింది.

మరణం కూడా ఆకస్మికంగానే ముంచుకు వచ్చింది.

అతను చేసిన చారిత్రిక పరిశోధనలు చాలా వున్నాయి; కాని "వేయిస్తంభాల గుడిశాసనం" వొక్కటే సముజ్జ్వలమైన గ్రంథరూపం పొందింది.

అది అతన్ని మృతజీవిని చేసింది.

ఇంత విచారంలోనూ యిది వొక్కటే నాకు వూరట కలిగిస్తున్నది.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

శ్రీ చిలుకూరి వీరభద్రరాయ సంస్మరణము

జటావల్లభుల పురుషోత్తము ఎం. ఏ

కీ. శే. శ్రీ చిలుకూరి వీరభద్రరావుపంతులుగారితో నాకు గడచిన యేడు సంవత్సరములలోను సన్నిహిత పరిచయముండెను. వారాంధ్ర చరిత్రరంగములో ప్రారంభకులు మాత్రమే కాక ప్రథమగణ్యులు గూడ నగుటచేతను, సారస్వత రాజకీయాది విషయములలో గూడ వారికి దేశములో నొక గణ్యమైన స్థానముండి యుండుటచేతను వారి జీవితవిధానమును నాదర్శాశయ ప్రకృతులను తెలిసికొనుట కాంధ్రులు కుతూహలురై యుండుట సహజము. నాకంటెను వారితో నెక్కుడు సన్నిహితపరిచయముగల్గిన వారలనేకులుందురు. అయినను "ప్రబుద్ధాంధ్ర" సంపాదకుల యాదేశానుసారము కీర్తిశేషులను గూర్చి యొకింత సంస్మరణము నీచిన్నివ్యాసములో చేయదలచితిని. విపులముగా వారినిగూర్చి ముచ్చటింపగల వారట్లు చేయుదురుగాక! పంతులుగారి మతాశయములను గూర్చి ముందుగ బేర్కొందును. కీ. శే. వల్లూరి సూర్యనారాయణరావుగారి విల్లుప్రకారము వారి సుమారు ౬౦ వేల రూపాయలమీదవచ్చే వడ్డీని పుస్తక ప్రచురణమునకు వినియోగించుటకై యొక పండిత పరిషత్తేర్పాటు కావలసియుండెను. అందయిదుగురు సభ్యులు. నేనును శ్రీ సూర్యనారాయణరావు పంతులుగారి కుమారులిద్దరును యావజ్జీవ సభ్యులముగ నుండవలెననియు మిగిలిన యిద్దరిని మేమే యేటేటను నెన్నుకొనుచుండవలెననియు నిందులో సభ్యులుగానుండు వారెవ్వరు నేమత గ్రంథము దైవదత్తమని కాని యనుల్లంఘనీయమని కాని విశ్వసింపమని ముందుగా ప్రమాణపత్రమును దాఖలుచేయవలెననియు విల్లులో నుండెను. యావజ్జీవ సభ్యులమగు మాముగ్గురకు నీషరతు వర్తింపదని నేననుకొంటిని కాని మావిద్యాపీఠ నిర్వాహకులట్లు తలంపక మేము కూడ ప్రమాణపత్రముల నీయవలెననిరి. నేను వేదప్రామాణ్యమునందు విశ్వాసము కలవాడనగుటచే సభ్యత్వమును వదలుకొనుటకైనను సమ్మతించితిని గాని ప్రమాణపత్రము నిచ్చుట కంగీకరింపలేదు. ఆసందర్భమున శ్రీవీరభద్రరావుపంతులుగారు నాకీక్రిందివిధముగ సలహా చెప్పిరి. "ఇట్టి విషయములలో మాటలనే ప్రధానముగ చూడక భావమును ప్రధానముగ చూడవలెను. పండిత పరిషత్తులోని సభ్యులెవ్వరును వైదికమత విశ్వాసములు లేనివారై నిష్పాక్షిక విమర్శను మత విషయములో కూడ సహించువారుగ నుండవలెననియే సూర్యనారాయణరావుగారి యభిప్రాయము. ఆయభిప్రాయమునే మీరు తీసికొనవలెనుగాని వేదప్రామాణ్యము కూడదను కేవల వాచ్యార్థమును తీసికొనకూడదు. కనుక ప్రమాణపత్రమునిచ్చి సభ్యులు కండు. దానివలన మీరాంధ్ర సారస్వతమునకు గొప్పసేవ చేయగల్గుదురు." పంతులుగారి వాదము నాకు నచ్చలేదు. నేను సభ్యత్వమును వదలుకొంటిని. అటుపిమ్మట పంతులుగారే యట్టి ప్రమాణపత్రమునిచ్చి పండిత పరిషత్తులో సభ్యులైరి. మతము కాలానుసారము మారవలెననియు వేదములే యన్నికాలములకును ప్రమాణములు కావనియు పంతులుగారి యభిప్రాయము.

మతమునందుకంటె వేదాంతమునందు వారి కెక్కుడగౌరవముండెను. ప్రతివానికిని ఆధ్యాత్మికదృష్టి యవసరమనికూడ వారి నమ్మకము. ఒకపరి వారు నాతోనిట్లనిరి, "వల్లూరి సూర్యనారాయణరావుగారు సంఘసంస్కరణమును గూర్చియు మూఢ విశ్వాసములను గూర్చియు వ్రాయు వ్రాతలు బాగుగనే యుండుగాని యాధ్యాత్మిక విషయమున వారు గన్పఱచు నాస్తికధోరణి నాకు నచ్చలేదు." ఆధ్యాత్మిక జీవితమునకు జీవమని చెప్పదగిన వైరాగ్యము వీరభద్రరావుగారి జీవితములో ప్రతిబింబించుచునుండెనను సంగతి వారి నెఱిగినవారికెల్లరకు స్పష్టము.

ప్రజలకు గల భక్తిభావములను సత్యము పేరుచెప్పి చెడగొట్టకూడదని వీరభద్రరావుగారి యభిప్రాయము. ఒకప్పుడు విమర్శకాగ్రేసర కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రులు మావిద్యాపీఠములో నుపన్యసించుచు కౌరవులదే న్యాయమనియు, పాండవు లన్యాయము చేసిరనియు, శ్రీకృష్ణుడన్యాయపక్షము నవలంబించెననియు విపులముగ ముచ్చటించిరి. అంత వీరభద్రరావుగా రిట్లనిరి. "చారిత్రకసత్య మెట్లున్నను లక్షలకొలది ప్రజలు శ్రీకృష్ణుడు దైవమని విశ్వసించుచుండగా కృష్ణుని నిరసించుట లోకమునకు నష్టమునె కల్గించును. ఇట్టి విషయములలో సత్యాన్వేషణమును చేయుట కిది మార్గము కాదు."

వీరభద్రరావుగారికి జ్యోతిషములో చాలనమ్మక ముండెను. తమ జీవితములోని ముఖ్యాంశము లన్నియు జ్యోతిషికులు చెప్పినట్లే జరిగెనని వారు నాతో ననిరి. తమ మరణకాలమును కూడ వారు జ్యోతిషము ననుసరించి ముందుగ తెలిసికొనియే యుండిరి.

శ్రీ పంతులుగారు బాలవృద్ధపండితపామర విభేదములేకుండ నెల్లరితోను మర్యాదతో ప్రవర్తించెడివారు. వారాత్మగౌరవమును గూడ హెచ్చుగ పాటించుచుండిరి. గడచిన రెండు సంవత్సరములను శ్రీ వీరభద్రరావుగారి జీవితము మహామహోపాధ్యాయ శ్రీవాదకృష్ణమూర్తిశాస్త్రులుగారు వారిపైన తెచ్చిన యభియోగములో చిక్కుకొని యుండెను. దానివలన వారికి మనఃక్లేశమును శారీరక్లేశమును గూడ హెచ్చుగ గల్గెను. ఈ కేసు రాకుండ చేయుటకై నేను చాల ప్రయత్నించితిని. వృద్ధపండిత ప్రకాండులిద్దరును గూడ నారాజీసూచనల నంగీకరింపలేదు. ఆసందర్భమున నేను వీరభద్రరావుగారితో మాట్లాడుచు "ఈ వార్ధకములో మీ జీవితమును కష్టభాజనము కానీయకుడు. రాజీ కంగీకరింపుడు" అంటులకు వారిట్లనిరి "ప్రాణమును పోవుటకైనను నంగీకరింతును గాని యాత్మగౌరవము పోవుట కంగీకరింపను." కేసుకాలములో వీరి దేహము మిక్కిలి కృశించిపోయినది. కేసుఫలితము కూడ చాల దుష్ఫలితమును

గల్గించి యుండును. కేవలవర వారి మరణము సన్నిహితము గావింపబడిన దని నా విశ్వాసము.

శ్రీ వీరభద్రరావుగారు గొప్ప జాతీయవాది. సాధారణముగ ఖద్దరునే ధరించుచుండిరి. కొంతకాలముపాటు దినములనుండియు వారు జాతీయోద్యమములో పనిచేయుచుండిరి. తాము పత్రికను నడపు దినములలో సంఘసంస్కరణమునకును జాతీయోద్యమమునకును నెట్లు తోడ్పడుచుండిరో వారు తరచుగ నాతో చెప్పుచుండిరి. అన్నివిధములైన సార్వజనికోద్యమములలోను వారు శ్రద్ధను గన్పఱచుచుండిరి.

పంతులుగారి యాంధ్రాభిమాన మన్నిటికంటెను హెచ్చైనది. ఆంధ్రశబ్ద ముచ్చరించిన తోడనే యనేకులకు వీరభద్రరావుగారి పేరు జ్ఞప్తికివచ్చును. ముప్పదిసంవత్సరముల క్రిందట వారు రచించిన యాంధ్రులచరిత్ర వలన నాంధ్రులలో నాత్మగౌరవము, ఆత్మజ్ఞానము గల్గెను. ఆంధ్రుల చరిత్రను సంస్కరించియు పెంచియు పదిసంపుటములలో ప్రకటింపవలెనను సంకల్పము వారికుండెను. కాకతీయ యుగమునకు సంబంధించిన చరిత్ర ప్రకటించుటతోడనే ప్రభురవిధి యా సంకల్పమునకు స్వస్తిచెప్పించుట యాంధ్రవిజ్ఞాన ప్రపంచము యొక్క దౌర్భాగ్యమని చెప్పవలెను.

ఆంధ్రభాషావాఙ్మయములందు శ్రీ వీరభద్రరావుగారి కమిత భక్త్యభిమానము లుండెను. ఆంధ్రభాషాపోషకములు బాల్యాలంకార ములైన గ్రంథములను గూడ వారు రచించి యున్నారు. పరభాషలచే నాంధ్రభాష యణగద్రొక్కబడుట వారికి సంతాపకరముగ నుండెను. మద్రాసు ప్రభుత్వమువారి హిందీనిర్బంధ విధానము మాతృభాషకు పెద్దదెబ్బ యని వారు తరచుగ చెప్పుచుండిరి. సుమారు రెండుసంవత్సరముల క్రిందట కొవ్వూరులో జరిగిన బహిరంగసభలో వారు హిందీ ప్రాబల్యమున మాతృభాష యెట్లు దెబ్బతినునో చక్కగా వివరించి యుండిరి. ప్రస్తుతము హిందీ మనకు హానిని చేయుటయే కాక ముస్ముందు హిందీస్థానమును ఉర్దూ ఆక్రమించు ననియు నప్పుడు ఉర్దూ పారస్యతను, మహమ్మదీయ విజ్ఞానము ప్రాబల్యము చెంది ఆంధ్రభాషా హిందూవిజ్ఞానములకు ముప్పు తెచ్చుననియు పంతులుగారు చెప్పుచుండిరి.

సార్వజనిక విషయములను దూరదృష్టితో నాలోచించుట పంతులుగారి కలవాటుగ నుండెను. అంతర్రాతీయ యుద్ధము, ప్రపంచ పరిణామము మున్నగు నంశములను గూర్చి వారు తరచుగ ప్రసంగించు నపుడు సూక్ష్మబుద్ధి, విజ్ఞానబాహుళ్యము వెల్లడి యగుచుండెను.

సాధారణముగ కొవ్వూరులో నేమీటింగయినను వీరభద్రరావుగారు హాజరగుచుండిరి. సభ ప్రారంభమునుండి తుదివరకును కూర్చుండెడివారు. ఎంత కుఱ్ఱవాడు మాట్లాడుచుండినను మిక్కిలి శ్రద్ధతో వినెడివారు. ఉపన్యాసకుని ప్రశ్నలను వేయుట వారికి రివాజు. ఒక్కొక్కప్పుడా ప్రశ్నలు మితిమీరి వారికిని ఉపన్యాసకునకును సంభాషణక్రింద పరిణమించెడివి. ఒకసారి మా విద్యాపీఠములో జరుగుచుండిన సభలో నట్టి పరిస్థితిని నేను సహింపలేక "పంతులుగారూ, సభలో మీరే కాక యితరశ్రోతలు గూడ కలరని మఱవకుడు" అని హెచ్చరించితిని. అందులకు వారు కోపగించుకొనలేదు. కాని నేటివరకును నేను నాడు వారిపట్ల జూపిన యమర్యాద తలచుకొనినపుడు లజ్జితుడ నగుచుందును.

పంతులుగారు భౌతికదేహమును వీడినపుడు నేను గ్రామాంతరములో నుండినందులకు విచారించితిని. ఆవార్త వినినవెంటనే నాకు వారిని గూర్చి గల యభిప్రాయములను దెల్పుచు నొకవ్యాసమును వ్రాసి పత్రికలకు పంపితిని. అందు తెలుపని యంశములను కొన్నిటి నీవ్యాసములో పేర్కొంటిని. ఆంధ్రోద్యమము, ఆంధ్రత్వము విజృంభించుచున్న యీదినములలో ప్రథమాంధ్ర చరిత్రకారుని గౌరవపురస్సరముగ స్మరింపనివా రెవరుందురు?

గాంధీజం

చండ్రుపట్ల సూర్యనారాయణ

ఈ యిరవయ్యో శతాబ్దం వివిధ పరివర్తనాలను, నూతనాభిరుచులను ప్రపంచానికి ప్రసాదించింది. ఈ నూతనోద్దేశాలు రాజకీయంగా సంగ్రహింపబడి వివిధదేశాల్లో వివిధపద్ధతులతో అవలంబింపబడుతున్నాయి. వీటి ననుసరించే రష్యాలో కమ్యూనిజం, జర్మనీలో నాజీజం, యిటలీలో ఫాసిజం, అమెరికా ఫ్రాన్సు మొదలైన దేశాల్లో ప్రజాప్రభుత్వాలూ, యిండియాలో గాంధీజం ఏర్పడి అనుసరింపబడుతున్నాయి.

కార్యక్రమంలో భేదాలు ఉన్నప్పటికీ ఆశయాలు ఒక్క కమ్యూనిజంలో తప్ప మిగిలిన అన్ని పద్ధతుల్లో యించుమించు ఒకేవిధంగా ఉన్నాయని చెప్పవచ్చును. ప్రజలకందరికీ తినడానికి తిండీ, కట్టడానికి బట్టా, ఉండడానికి యిల్లూ నిత్యజీవనానికి అత్యవసరాలు. చదువూ, వాహనాలూ, భోగవిలాసాలూ నిత్యజీవనానికి అత్యవసరాలు కావు కాని నాగరకతా లక్షణాలుగా యెంచబడుతున్నాయి. ప్రతి నాగరిక దేశంలోనూ మానవ జీవితాన్ని సౌఖ్యవంతంగానూ, ఆహ్లాదయుతంగానూ మార్చడానికీ, విజ్ఞానాన్ని వృద్ధిచేసి కనీస ఆదాయాన్ని సాధ్యమైనంత వరకు పెంచడానికీ విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయా దేశాల ఆశయాలు యివే. వీటిననుసరించే వివిధరాజ్యాల ఆర్థిక ప్రణాళికలు ఏర్పడి ఉన్నాయి.

కాని ఉత్కృష్టమైన ఆశయాలు కలిగి ఉన్నప్పటికీ సామ్యవాదేతరరాజ్యాంగ విధానాలు కలిగిన దేశాల్లో మానవజీవితం దుర్భరం

అయిపోతోంది. మానవుడిలో మానవత్వం నశించి రాక్షసత్వం ఆవేశిస్తోంది.

అనేక వేల సంవత్సరాలుగా ప్రపంచం ఒక్క పద్ధతికి అలవాటు పడి వుంది. 'బలవంతుడిదే అధికారం, ధనవంతుడిదే బలం'. ఒక వ్యక్తి శారీరకంగా దుర్బలుడైనా ధనవంతుడు కావడంవల్ల ఓ ముఠాను పోషించి, బీదవాళ్లను హింసించి సంఘజీవితం శాసించగలగడం ఆదికాలంనుంచీ అనుశ్రుతంగా వస్తూన్న ఆచారం. నాటి సాంఘిక వ్యవస్థే నేటి రాజకీయవ్యవస్థగా మారిపోయినది. కేవలం కృత్రిమమైన—మానవనిర్మితమైన ఆర్థిక వ్యవస్థవల్ల ఒక మహోన్నత ప్రాసాదాని కెదుట ఒక పూరిగుడిసె,—నిత్యభోగ విలాసాలతో పైమరచే భోగికి యెదురుగుండా ఆకలిబాధవల్ల సొమ్మసిల్లిన అభాగ్యులు ఏర్పడ్డం సంభవించింది. ప్రాణికోటికి సహజం అయిన ఆకలి అణచుకోడానికి మార్గాంతరాలు లేక దొంగతనం, వ్యభిచారం, హత్యలు, అసత్యాలు అవలంబింపవలసి వచ్చింది. ఈదోషాలు బీదవాళ్లలో క్షుద్బాధ తీర్చుకోడానికి బయలుదేరితే భాగ్యవంతుల్లో లోభం ప్రబలిపోయి తద్వారా అసమానం, అసత్యం, కాఠిన్యం, కలుషత్వం పెచ్చుపెరగడానికి అవకాశం కలిగింది. ఈశ్వరసృష్టిలో సమాన భాగస్థుడైన తోడిమానవుడిచేత మోయించుకోవడం ఠీవిగా భావించుకొన్న తరువాత, తోడిసహోదరుడి—ఆకలితో వస్తుపడివున్న సంసారాన్ని బ్రతికించుకునే నిమిత్తం మానం అమ్మడానికి సిద్ధపడిన—యిల్లాలిని చెరిచి తాను రసికుడుగా భావించుకుంటూ వున్నప్పుడు, పొట్టకై రెక్కలమ్ముకొన్న సోదరమానవుల్ని అధికారమత్తుడై హింసించి తన హోదా చూసుకొని గర్వపడుతూన్న తర్వాత మానవుడిలో మానవత్వం యెక్కడిది? అయితే అధికారమత్తుడైన అలాంటి భాగ్యవంతుల్ని కాపాడడమే నేటి రాజకీయాల పరమావధి అని చెప్పడంలో సాహసం యేమీలేదు.

సామ్యవాదేతర సిద్ధాంతాలు, కలిగిన ప్రతీదేశంలోనూ ధనికుల ప్రాబల్యం, రాజ్యాధికారం ఏర్పడి ఉన్నాయి. కేవలం ప్రజా ప్రభుత్వాలని చెప్పబడే బ్రిటను, ఫ్రాన్సు దేశాల ప్రభుత్వాలే అలా ఉన్నవి. ఇంగ్లండులో యెప్పుడూ ౪౦ కుటుంబాలవారూ, ఫ్రాన్సులో యెప్పుడూ ౨౦ కుటుంబాలవారూ రాజ్యయంత్రం నడుపుతూ ఉంటారు. వీరందరూ ధనికులే.

వీరు తమ ధనికప్రభుత్వాలు చిరస్థాయిగా ఉండేటందుకు అవసరమైన అన్ని పద్ధతులూ అవలంబిస్తారు. సామాన్యప్రజలూ, కార్మికులూ తమ మీద తిరుగుబాటు చెయ్యకుండా వుండేటందుకు చతురుపాయాలనూ ఉపయోగిస్తారు. వారిదృష్టిని రాజకీయాలలోంచి మళ్లించేటందుకు మతబోధలు, సంగీతనాటాలు, పానశాలలు, సినిమాలు వగైరా స్వాంతకర్తృత్వాలపైన ఏర్పరుస్తారు. తమ ధార్మిక ప్రవృత్తినీ, సామర్థ్యాన్ని గోరంతలు కొండంతలుచేసి వర్ణించడానికి పత్రికలు పెట్టి నడిపిస్తారు. తామింకా భాగ్యవంతు లయ్యేటందుకు ఫాక్టరీలు పెడతారు. విదేశాలమార్కెట్లు ఆక్రమిస్తారు. విదేశాలు జయిస్తారు. వాటిని రక్షించుకోడానికి బీదవాళ్లని డబ్బుపెట్టుకొని యుద్ధాలు చేయిస్తారు. యీమార్కెట్లు చాలక కొత్తగా దేశాలు కనుక్కునే నిమిత్తం భూఖండాలు శోధిస్తారు. ధృవాలు పరిశీలిస్తారు. గ్రహమండలాల్లో ప్రవేశించడానికి పరిశోధనలు సాగిస్తారు. ఈ ధనిక ప్రభుత్వంలో ధనవంతుడు విశ్వరూపం తాల్చి ఉంటాడు. వీరిని ఎదిరించిన వాడు రాజద్రోహి, మతద్రోహి, దేశద్రోహి, దైవద్రోహిగా యెంచబడి స్వరూపనాశం పొందుతాడు.

ఈ ప్రభుత్వాల్లో జాతీయపునర్నిర్మాణ కార్యక్రమం, విశేష మారణయంత్ర సాధనాల ఉత్పత్తి ఏకకాలంలో కొనసాగింపబడుతున్నాయి. అయితే జాతీయపునర్నిర్మాణ కార్యక్రమం తాబేటి నడకా, మారణయంత్రాల ఉత్పత్తి కుందేటినడకా నడుస్తున్నవి.

వీరి యీ ధనికప్రభుత్వంలో సత్యానికి అహింసకి తావులేదు. వారి దృష్టిలో దొంగతనం, వ్యభిచారం, హత్య మొదలైనవి బీద వాళ్లలోనే నేరాలు. ఆ నేరాలైనా సహజమైనవనీ, పూర్తిగా లేకుండా చెయ్యడం అసాధ్యమనీ వారినమ్మిక. యథార్థవాది వారి దృక్పథంలో రాజకీయవేత్త కానేకాడు. వర్తకంలో దళారీ యెంత సత్యసంధుడో రాజకీయ చక్రం నడిపే అధికారి కూడా అట్టివాడుగానే ఉండాలని నేటివారి ఊహ. పశ్చాత్తాపం, చేసిన తప్పు ఒప్పుకోవడం వారి దృష్టిలో నాయకలక్షణాలు గావు.

భారతవర్షంలో నేడు అవలంబింపబడివున్న గాంధిజం భిన్న తత్త్వాలను, కార్యక్రమాలను గలిగి ఉంది. సత్యం, అహింస—వీటిపైన ఆధారపడి రాజకీయ యంత్రం నడవాలి. అంతరాత్మ శుద్ధి పొందిన కర్మయోగికి మాత్రమే రాజకీయరంగంలో ప్రవేశం. వ్యక్తిద్వేషాలూ, మతకలహాలూ, అశాంతీ, అవినీతీ అడుగంటాలి. ప్రజలకందరకీ అన్నవస్త్రాలకి లోటులేకుండా ఉండాలి.

భాగ్యవంతులు బీదవాళ్లకి సంరక్షకులుగా ఉండాలి. అవినీతికీ, దురాశకీ, దౌర్జన్యానికీ, సామ్రాజ్యవాదానికీ, కారకమైన ఆధునిక యంత్రపరికరాలు పూర్తిగా విసర్జింపబడి ప్రాచీన గృహపరిశ్రమలు పునరుద్ధరింపబడాలి. ప్రజలు దైవభక్తి, మతచింతనగల వారుగా ఉండాలి. యివీ ఆశయాలు. వీటిని సాధించేందుకు సత్యాహింసలే సాధనాలు.

అయితే భారతదేశం విశాలమైన దేశం అవడం వల్లనూ, బీదవాళ్లంతా పల్లెల్లో దినమంతా పాటుబడి జీవితచక్రం దొర్లించుకుంటూ వుండి తగినంత విజ్ఞానమూ, విరామమూ, సంపదా లేకపోవడం వల్లనూ, సహజంగా రాజ్యాధికారం ధనికులకే సంక్రమిస్తుంది. అందుచేతనే ధనికులు బీదవాళ్లకి సంరక్షకులుగా ఉండాలంటున్నారు మహాత్ముడు. అయితే యితరదేశాల్లో ధనికప్రభుత్వాలని ఏవగించుకుంటున్న మనం మనదేశంలో మళ్లీ అట్టి ప్రభుత్వానికి దోహదం యివ్వడం వివేకమైన కార్యం అవుతుందా? అసలు గాంధిజంలోని ఆశయాలని సాధించగలుగుతుందా?

సహజంగా మానవస్వభావం శాంతినే కాంక్షిస్తుందనీ, యాంత్రిక పరిశ్రమలే మానవుడి శాంతి ప్రవృత్తిని హింసాప్రవృత్తిగా మార్చివేశాయనీ, కాబట్టి యాంత్రిక పరిశ్రమల నిర్మూలనంవల్ల ధనికుల హృదయాలు మారుతాయనీ, కేవలం యుద్ధాలకి కారణం యాంత్రిక పరిశ్రమలేననీ గాంధీగారి సిద్ధాంతాలు.

చరిత్ర చదివిన ప్రతీవాడికీ పైసిద్ధాంతంయొక్క సత్యాసత్యాలు అవగాహనకాక పోవు. యాంత్రికపరిశ్రమలు యీ శతాబ్దిలోనే ఉద్భవించి ఉన్నాయి. అంతఃపూర్వం ధనికులున్నూ ఉండినారు. యుద్ధాలున్నూ ఉండినవి. ఒక్క ౧౦౪౦–౪౯ సంవత్సరంలో ఉ పెద్ద యుద్ధాలు జరిగి ఉండినయి. ఆ యుద్ధాలకి కారణాలు యాంత్రిక పరిశ్రమలు కావే? పైసిద్ధాంతకర్తలు దీనికేం చెబుతారూ?

కాగా ధనికులు సహజంగా స్వార్థపరులు. వారు తమస్వార్థం నిగ్రహించుకు రావడంలో యితరుల మంచిచెడ్డలకి లక్ష్యపెట్టరు. వెనక యీజిప్టులో ధనికుడైన ఒక యజమాని మరణిస్తే పైలోకంలో పరిచర్యలు చేసే నిమిత్తం అతని సేవకుల్ని కొందరిని బతికుండగానే యజమాని శవంతో పూడ్చిపెట్టేవారట. ఈ విషయం భాగ్యవంతుల మానసికప్రవృత్తిని చక్కగా విశదపరుస్తుంది. అదిన్నీ గాక దక్షిణాఫ్రికా మొదలైన ప్రాంతాల్లో ధనికుల తేయాకు తోటల్లో పనిచేసిన కార్మికుల్ని కొరడాలతో గొట్టడం మనం వింటున్నాము. నీగ్రో బానిసల్ని అమెరికా ధనవంతులు బతికుండగా కాల్చిచంపడం మనం వింటున్నాము. ధనికునిలో ఉన్న హింసాప్రవృత్తి నేడు యాంత్రికపరిశ్రమల వల్ల కలిగిందికాదని ప్రపంచం గుర్తించలేని స్థితిలో ఉందా!

అంతే కాకుండా తనకు సహజగుణమైన స్వార్థాన్ని సాధించుకునే నిమిత్తమే ధనికుడు యీ యాంత్రికపరిశ్రమల్ని సాధనంగా ఉపయోగించుకుంటున్నాడు.

అదిన్నీ గాక యాంత్రికపరిశ్రమం లేకపోతే మరొకవిధంగానైనా తనస్వార్థం సాధించుకు తీరుతాడు. అట్లాంటి ధనికుడు రాజ్యాధికారం వహిస్తే గాంధీజం మాత్రం ఫాసిజంలోకి మారిపోయి తీరదూ?

గాంధీజంలో సత్యాహింసలకే అస్కారం లేదు.

యంత్రనిర్మూలనం వల్ల సామ్రాజ్యతృష్ణా, యజమానులకీ, కార్మికులకీ ఉండే వర్గపోరాటమూ తగ్గిపోవచ్చు. కాని రక్తపాతమూ దౌర్జన్యమూ అశాంతీ, అవినీతీ మట్టుకు తగ్గిపోవడానికి అవకాశం లేదు. ఏమంటే అసలు అవినీతికి రెండూ కారణాలు— ఒకటి కాంతా, రెండు కాంచనమూనూ. ఈ రెండూ కూడా నేటికీ సొంతాస్తిగా భావింపబడుతున్నాయి. ప్రపంచంలో జరిగిన, జరుగుతూన్న యుద్ధాల్లో విశేషభాగం వీటినిమిత్తమే అయి ఉన్నాయి. ఈ రెండూ పురుషుని సొంతఆస్తి కింద భావించినంతకాలమూ, స్వలాభమూ, యీర్ష్య, లోభమూ మానవుడికి సహజగుణాలుగా అలవడి ఉంటాయి. వీటి ఫలితంగానే మానవసంఘం పతితస్థితిలోనైంది.

స్త్రీ విషయం ప్రత్యేకప్రాధాన్యమైనది కావడంవల్ల, వేరే వ్యాసంలో వివరింపవలసి ఉంటుంది. అందుచేత కేవలం ఆర్థికవిషయాలపైన మాత్రమే చర్చసాగించడానికి పూనుకుంటాం.

ఆర్థికంగా పరిశీలిస్తే—ఒక వ్యక్తిదగ్గర అనంతమైన ధనరాసులు మూలుగుతూ భోగాలకి వ్యయమవుతూ ఉండీ, మరొకవ్యక్తి ఆకలిబాధతో తినడానికి లేక మాడిచచ్చిపోతూ ఉన్నప్పుడు అది గాంధీజం అయినా, ఫాసిజం అయినా, మరే 'యిజం' అయినా శాంతి అహింసలను నిలబెట్టగలుగుతుందా?

ఇండియాలో ప్రజలకందరికీ సరిపడిన భోజనపదార్థాలు ఉండాలంటే ౪౧ మిలియన్ల టన్నుల ధాన్యాదులు పండాలి. అయితే మొత్తం దేశంలో పండేవంతా ౪౮-౭ మిలియన్ల టన్నులు. సర్ ఛార్లస్ ఎలియెట్, సర్ విలియంహాంటర్ వంటి సుప్రసిద్ధ రాజ్యాంగవేత్తలే హిందూదేశంలో అయిదవవంతు ప్రజలు ఒకపూట తిని జీవిస్తున్నారని అంచనా వేశారు. పరిస్థితులిలా ఉన్నప్పుడే, ఒకవంక ప్రజలు తిండిలేక మాడిపోతూ ఉన్నప్పుడే, ప్రజలకి చాలినంత పంట లేనప్పుడే దేశంలోంచి కోట్లకొద్దీ రూపాయలు విలువగల ధాన్యాదులు పరదేశాలకి యెగుమతి అవుతున్నాయి. ఈ ధనమంతా ధనికుల యినపపెట్టెల్లోకి చేరుతోంది. వారి భోగవిలాసాలకి ఖర్చవుతోంది. ఇంక క్షుద్బాధ తీర్చుకోడానికి బీదలు అవినీతినే సాధనంగా అవలంబించారంటే అవలంబించరూ?

వర్గభేదం ఉన్నంతకాలం నైతికంగా అభ్యున్నతి కలగదు. గాంధీగారున్నూ కూడా యీ అవినీతికి మూలకందం ఆర్థికవ్యవస్థ అని గుర్తింపకపోలేదు. బహుజనులకి పని పంచిపెట్టి యిచ్చే నిమిత్తమే ఆయనగృహ పరిశ్రమల్ని ప్రోత్సహిస్తున్నారు. అందువల్ల వచ్చే స్వల్పాదాయంతో ఆధ్యాత్మిక చింతనతో జీవితయాత్ర సాగించవలసిందిగా ఆయన సలహాయిస్తున్నాడు. అయితే యీ ఆర్థికసూత్రానికి సత్యాహింసల్ని ప్రధానకారణాలుగా ఏర్పరచి ఉంచినాడు. కాని గ్రామంలో సరకు తయారీ—పట్నవాసంలో మార్కెట్టు—మధ్య దళారీ—ఇక్కడ ధనికుల టోకు గొనుగోలు—రెట్టింపుధరల కమ్మబడి—లాభం వారిది—కష్టం వీరిది. యిక్కడ సత్యానికి తావేదీ—అహింసకున్నూ ఆస్కారం లేదే! దీనికి కారణం వ్యక్తిపరమైన ఆస్తి వుండడం కాదా?

ఇదిలా ఉండగా యంత్రయుగమైన నేటికాలంలో గృహపరిశ్రమలు యంత్రపరిశ్రమలకి పోటీగా నిలిచి జీవించడం అసాధ్యం. యాంత్రికపరిశ్రమలకి పోటీగా గృహపరిశ్రమలకి యెంతప్రోత్సాహమిచ్చినా అవి వర్ధిల్లడం యెంత దుస్సాధ్యమో యీ క్రింది ఉదాహరణవల్ల తెలుస్తుంది. ముఖ్యంగా గత పదేండ్లనుండిన్నీ గాంధీగారు కద్దరుకు విశేషప్రోత్సాహమిచ్చియున్నారు. శాంతిసమ

తరవాయి ౧౨౪ వ పేజీలో

మద్రాసు ప్రెసిడెన్సీ

జిల్లాల వారీగా పరిమితీ జనసంఖ్యానూ (౧౯౩౧ జనాభా)

		వైశాల్యం			జిల్లా హెడ్ క్వార్టర్సు	
జిల్లా	పట్నాలు	గ్రామాలు	చదరపుమైళ్ళు	జనసంఖ్య	పేరు	జనసంఖ్య
౧ మద్రాసు	౧		౨౯	౬,౪౭,౨౩౦	మద్రాసు	౬,౪౭,౨౩౦
౨ చిత్తూరు	౭	౪౫౨౨	౫,౯౦౧	౧౪,౪౭,౧౦౩	చిత్తూరు	౨౨,౦౧౮
౩ నెల్లూరు	౯	౧,౬౨౧	౭,౯౪౯	౧౪,౮౬,౨౨౨	నెల్లూరు	౪౫,౮౯౫
౪ గుంటూరు	౨౦	౯౨౬	౫,౭౫౭	౨౦,౩౫,౬౬౦	గుంటూరు	౬౫,౧౭౯
౫ కృష్ణా	౯	౯౨౧	౩,౫౪౭	౧౨,౫౪,౨౦౮	బందరు	౫౬,౯౨౮
౬ పశ్చిమగోదావరి	౧౦	౭౧౬	౨,౩౬౧	౧౨,౨౩,౦౫౬	ఏలూరు	౫౭,౭౪౨
౭ తూర్పుగోదావరి	౧౧	౧,౯౨౦	౬,౨౨౦	౧౯,౨౦,౫౮౨	కాకినాడ	౬౫,౯౫౨
౮ విశాఖపట్నం	౧౭	౧౧,౫౪౭	౧౭,౧౮౬	౩౬,౦౭,౯౪౮	విశాఖపట్నం	౫౭,౩౦౩
౯ గంజాం	౯	౬.౯౭౮	౮,౩౮౩	౨౪,౧౧,౬౧౯	బరంపురం	౩౭,౭౫౦
౧౦ కర్నూలు	౨	౭౯౬	౭,౫౮౧	౧౦,౨౪ ౯౬౧	కర్నూలు	౩౫.౩౧౪
౧౧ కడప	౮	౮౮౯	౫,౯౧౯	౯,౪౯,౩౯౭	కడప	౨౨,౬౦౨
౧౨ అనంతపురం	౧౨	౮౫౩	౬,౭౪౧	౧౦,౫౦,౪౧౧	అనంతపురం	౧౫,౦౯౯
౧౩ బళ్లారి	౧౦	౯౦౮	౫,౭౧౩	౯,౬౯,౭౭౪	బళ్లారి.	౪౭,౫౭౩
౧౪ చెంగల్పట్టు	౧౭	౨,౧౩౮	౩,౦౯౧	౧౬,౫౫,౧౧౫	సైదాపేట	౩౩,౦౩౭
౧౫ ఉత్తరార్కాడు	౨౨	౧,౯౯౮	౪,౬౪౮	౨౨,౬౬,౯౮౯	వెల్లూరు	౫౭,౨౬౫
౧౬ సేలం	౯	౧,౭౮౨	౭,౦౫౮	౨౪,౩౩,౯౭౨	సేలం	౧,౦౨,౧౭౯
౧౭ దక్షిణార్కాడు	౧౬	౨,౩౧౫	౪,౨౦౮	౨౪,౫౪,౫౦౭	కడలూరు	౫౯,౦౫౭
౧౮ కోయంబుత్తూరు	౧౩	౧,౧౦౨	౭,౦౮౫	౨౪,౪౫,౦౬౪	కోయంబుత్తూరు	౯౫,౧౯౮
౧౯ తంజావూరు	౨౨	౨,౫౧౧	౩,౭౪౨	౨౩,౮౫,౯౨౦	తంజావూరు	౬౬,౮౭౯
౨౦ తిరుచినాపల్లి	౧౨	౧,౦౬౦	౪,౩౧౪	౧౯,౧౨,౨౪౫	తిరుచినాపల్లి	౧,౪౨,౮౪౩
౨౧ మధుర	౧౯	౧,౦౬౬	౪,౯౧౨	౨౧,౯౫,౭౪౭	మధుర	౧,౮౨,౦౧౮
౨౨ రామనాథ	౩౧	౩,౫౬౫	౪,౮౧౯	౧౮,౩౮,౯౫౫	మధుర	౧,౮౨,౦౧౮
౨౩ తిరునల్వేలి	౩౩	౯౬౬	౪,౩౧౫	౨౦,౪౬,౯౦౭	తిరునల్వేలి	౫౭,౦౭౮
౨౪ నీలగిరి	౪	౫౩	౯౮౨	...	పాలంకోటు	౫౧,౯౯౦
౨౫ మలబారు	౮	౧,౭౪౧	౫ ౭౯౪	౩౫,౩౩,౯౪౪	కాలికట్టు	౯౯,౨౭౩
౨౬ సౌతుకనరా	౮	౮౦౦	౪,౦౨౧	౧౩,౭౨,౨౪౧	మంగుళూరు	౬౬,౭౫౬
	౩౮౯	౫౧,౪౮౭	౧,౪౨,౨౭౬	౪,౬౭,౪౦,౧౦౭		౨౩,౯౬.౪౦౨

రెవ్యూకోసం పుస్తకాలు

ప్రబుద్ధాంధ్రకు, రెవ్యూనిమిత్తం పుస్తకాలు పంపేవారు రెండేసి ప్రతులు—ఒకటి రెవ్యూ చేసేవారి నిమిత్తమూ మరొకటి పత్రికా భాండాగారం నిమిత్తమూ పంపాలి. ఒక్క ప్రతే వచ్చే పుస్తకాలు రెవ్యూ చెయ్యబడవు. రెవ్యూలు సమర్థుల చేతనే రాయిస్తాము; కాని ఎలాంటి పరిస్థితులలోనూ వాటిమీద జవాబులూ పునర్విమర్శలూ ప్రకటించము.

సంపాదకుడు

చందాదార్లకు విన్నపం

పాతచందాదార్లు తమ అడ్రెస్సులు మారితే తెలియపరచవలసిం దని కోరుతున్నాము. వారికి చందా అయిపోయేదాకా పత్రిక పంపుతాము. చేరనివారు వసూలు తెలియచేయాలి.

మానేజరు

ప్రబుద్ధాంధ్ర ఆఫీసు—రాజమండ్రి.

నారాయణరావు, పుల్లయ్యగార్ల పరవిక్రయం

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

ఈకథలో కమలకీ, బసవరాజుకీ వుండిన ప్రాముఖ్యం డైరక్టరుకి బోధపడలేదు.

ఈసంగతి, ఆపాత్రలు తెరమీదికి వచ్చినప్పుడల్లా స్ఫురిస్తూనే వుండినది.

అయిద్దరిలోనూ ముందు కమల సంగతి చూతాం.

కమలకి, వొకమూల, అక్క చచ్చిపోయిం దని దుఃఖం.

ఇంకోమూల, లింగరాజుని సాధించా లని కసి.

మరోమూల, చతికిలబడిపోయిన తల్లిదండ్రులను మనశ్శాంతి కలిగించి వుద్ధరించా లని అభిమానం.

ఎంత జటిల మైన సన్నివేశము!

ఎంత చక్కని పాత్ర!

కాని, నాటకకర్తా, ఫిలిముకవీ, డైరక్టరూ కూడా యీపాత్రకి పరిణతి కలిగించలేకపోయారు.

వారికి లింగరాజుమీద వుండిన దృష్టి, కమలమీదే కాదు, మరెవరిమీదా కూడా లేకపోయింది.

ఆదిలో "అన్ని విషయాలూ నాయిష్టంవచ్చినట్టు నడిపిస్తే బసవరాజుని పెళ్ళాడతా" నన్నది కమల.

ఇందులో యేదో వొక కల్పన కొంచెం చూచాయగా కనపడుతున్న దంటే సరే.

చివర, కోర్టులో తప్ప ఆకల్పన బహిరంగం కాలేదు.

ఈమధ్య జరిగిన దానికి కమలవల్ల కలిగిన పుష్టి యేమిటీ?

కమల సంకల్పించుకున్న పని చివరిదాకా చూపించకపోవడంలోనే వారికి గాంభీర్యం కనపడింది కాని యీమధ్య కథ నిస్సారం అయిపోయిం దని తోచలేదు.

ఇంకొక అసందర్భం కూడా వారికి కనపడలేదు.

అదేమి టంటే?

కమల చిన్నపిల్ల.

తల్లి విచారసాగరంలో మునిగిపోయి వుంది.

తండ్రి యుంబ్రహ్మ.

ఆమెవల్ల యే మవుతుందీ?

దుఃఖమూ, కసీ, అభిమానమూ ముప్పిరిగొనగా సతమత మయిపోవలసినదే; గాని ఆమె యేమి చెయ్యగలదూ?

ఏమి ఆలోచించగలదూ?

ఏమి కల్పన చెయ్యగలదూ?

ఏమి నిర్వహించగలదూ?

పాత్రధారిణికి పుష్పవల్లి కనక గున్నయేనుగు లాగ బొద్దుగానే వుండినా—పన్నెండు—మహాయితే పదమూడు సంవత్సరాల కమల, లింగరాజు రాసి యిచ్చిన కాగితాలు అగ్రిమెం టనీ, రసీదనీ, అవి కోర్టులో సుదర్శనచక్రం కంటే యెక్కువగా చెలామణీ అవుతా యనీ యేమి గుర్తించగలదూ?

భ్రమరాంబా, పురుషోత్తమరావూ అపసిబిడ్డని నమ్మి, ఆమె యేమి చేసినా వొప్పుకుని, యెలా చెబితే అలా చేసెయ్యడం సంభవమేనా?

కాగా, బంగారపు పళ్ళేని కయినా గోడ ఆసరా వుండా లన్నట్టు, చాలా తెలివయినదే అయినా కమలకి వెనక సూత్రధారు లుండాలి.

ఉండి తీరాలి.

కాని డైరక్టరు ఇదేమీ యోచించలేదు.

ఇదేమీ గుర్తించనే లేదు.

ఈఫిలిములో అందుకు తగిన పాత్రలు లేకపోలేదు. అయితే, డైరక్టరుకి, ఈలోటూ తెలవలేదు. ఆప్రయోజనమూ కనపడలేదు.

గతసంచికలో, చలపతిరావు పాత్ర అజాగళ స్తనంలాగ నిరర్థకం అయిపోయిం దని సూచించాను.

ఇప్పుడు దీన్నిబట్టి చూడగా, డైరక్టరుకి ఆపాత్రను సృష్టించడంలో, సరియైన వుద్దేశం వున్నట్టు కనపడ్డం లేదు.

చలపతిరావు పాత్రే కాక అతని భార్య పాత్ర కూడా ఇలాగ నిరర్థకమే అయిపోయింది.

ఇలా కాక ఆరెండు పాత్రలకూ ప్రాధాన్యం యిచ్చివుంటే కథ యెంత జటిలం అయివుండునూ!

సంకల్పం కమలకి స్వయంగా కలిగినా చలపతి కలిగించినా అతనూ, కొంతవరకూ అతని భార్యా సలహా చెబుతూ కమలని నడిపించి వుంటే యెంత బాగుండేదీ?

పెళ్ళిలో కూడా వారిద్దరూ ఎంత చక్కని సన్నివేశాలు కలిగించి వుండేవారూ!

అలా జరిగివుంటే పురుషోత్తమరావుదంపతులకూ కమలకూ ఎంత దర్జా వచ్చివుండునూ!

లింగరాజుకి ఎంత వుక్కిరిబిక్కిరి కలిగి వుండునూ?

ఫిలిమున్నూ ఎంత చక్కని సాంసారికం అయి వుండేదీ?

౭

చలపతిరావుదంపతులకు ప్రాధాన్యం యివ్వకపోవడానికి సాయం కమలపాత్రకు పుష్పవల్లిని నిర్ణయించడం—యిది మరీ అసందర్భంగా వున్నది.

పుష్పవల్లి చాలా తెలివయినదే. చాలా చురుకయినదే, చాలా గొప్ప నటీ—అంటే కాగలదే.

కాని, ఆమె అన్ని రసాలూ పోషించలేదు.

ముఖ్యంగా, రసస్థైర్యమూ, రసస్థైర్యమూ కనపరచవలసిన చోట ఆమె యెంతమాత్రమూ పనికిరాదు.

ప్రకృతం కమల పాత్రకు ఆమె తగినది కాదు.

తగనే లేదు.

ఆపాత్రకు తగినది శ్రీమతి భానుమతి.

కాని, డైరక్టరుకి భావనాశక్తి, విచక్షణతా తక్కువ కావడం వల్ల, ఈఫిలిము, కాళింది జీవితఘట్టాలన్నీ ప్రత్యక్షంగా చూపించడం మూలంగా పేలవం అయిపోవడమే కాకుండా, భానుమతి శక్తీ, చాతుర్యమూ, ధానూ వ్యర్థం చేసెయ్యబడినవి.

నిజానికి, ఈఫిలిములో పుష్పవల్లి వుండవలసిన అగత్యం చాలా యెక్కువగానే వున్నది; అయితే, ఆమెకి తగినది సుభద్ర పాత్ర.

ఆపాత్ర శ్రీమతి కోటీరత్నానికివ్వడం ఔచితి మాలిన పని.

ఆమె కూడా యీ ఫిలిములో వుండవలసిన అవశ్యకం లేక పోలేదు.

కాగా, ఆమెని చలపతిరావు భార్యగా ప్రవేశపెట్టి వుండవలసింది.

ఎన్నోమార్లు సుభద్ర కోరగా—పోరగా క్షౌరం చేయించుకుని తగిన వస్త్రాభరణాలు ధరించడంవల్ల లింగరాజు రూపం పెళ్లిలో స్ఫుటంగా కనపడింది.

దాన్నిబట్టి ఆలోచిస్తే అతనికి మూడో పెళ్లి అయి వుండవచ్చు; కాని సుభద్రమాత్రం మూడోపెళ్లి పెళ్లాముగా కాక మొదటిపెళ్లి పెళ్లాముగానే వున్నది.

కారణం కోటీరత్నం వయస్సు అలాంటిది కావడమే.

అంచేత సుభద్రపాత్ర పుష్పవల్లికీ, చలపతిరావు భార్య పాత్ర కోటీరత్నానికీ యిచ్చి వుండవలసింది.

అలా చేసి వుంటే సుభద్ర తపన సార్థకం అనిపించి వుండును.

పెళ్లిలో, ఆమెచేత, లాంఛనాలదగ్గిర పెంకి పట్టు పట్టించి, యిక్కడ భ్రమరాంబ, కాళింది మృతివల్ల కూలిపోయి వున్నది కనక—ఆమె కమల పెళ్లిలో కులాసాగా వుండడం అసందర్భం కనక—భ్రమరాంబకి చలపతిరావు భార్యని సహకారిణిగా చేసి సుభద్రకు తగిన జవాబులు ఆమె చేత చెప్పిస్తే యెంతో బాగా వుండేది.

అలా జరక్కపోవడంవల్ల పెళ్లితంతు అంతా వెలవెలబోతూ వుండింది.

అంత కట్నమూ, అన్ని లాంఛనాలూ దోచుకున్న లింగరాజు పెళ్లిలో యెన్ని పేచీలు పెట్టినట్టు చూపించాలో, అతని పెళ్లాము కూడా యెంత రాగతనం చూపించినట్టు కనబరచాలో డైరక్టరు ఆలోచనకు అందలేదు.

ఫిలిము కవికి కూడా యీభావన వెళ్లలేదు.

ఇలాగ, యీఫిలిములో కథ నీరసం అయిపోవడమే కాకుండా, భానుమతి ప్రతిభ అడవిగాసిన వెన్నెల అయిపోవడమే కాకుండా పుష్పవల్లి చాతుర్యమూ, కోటీరత్నం నైపుణ్యమూ కూడా నిష్ప్రయోజనం అయిపోయాయి.

కోటీరత్నానికి, దేశంలో. వొక సందర్భంలో మంచి పేరే వున్నది.

పుష్పవల్లిన్ని వొక సందర్భంలో చరచరా పైకి వచ్చేస్తున్నది.

అర్ధయుద్ధర్ని చూద్దాం—అయిద్దరూ నటించిన ఫిలిము చూడ్డం అంటే జనులకు వుబలాటమే.

అయితే, సందర్భమూ ఔచిత్యమూ, చూడవద్దూ?

"చెల్ మోహనరంగా" ఫిలిము తియ్యడం యెంతో బాగుంది; కాని డైరక్టరుకి అందులో పకడ్బైన కల్పన వెళ్లలేదు.

పుష్పవల్లికి దిద్దుబాటూ (ట్రెయినింగూ) చాలింది కాదు.

అయినా, ఆమె మంచిపేరు తెచ్చుకున్నది.

"మోహినీభస్మాసురం" లో, భస్మాసురపాత్రకు తగిన ఠీవీ, రసికతా కలిగించడానికి డైరక్టరుకి చాలినంత ప్రౌఢిమ లేకపోయింది.

గంభీరమైన సంభాషణ నడపడానికి కవికి గూడా భావనాశక్తి చాలింది కాదు.

ఆవిధంగా, ఆఫిలిములో కూడా పుష్పవల్లికి తగిన హంగు లేకపోయింది.

అయినా, ఆమె సెబాస్ అనే అనిపించుకున్నది.

కనక?

ఏదో వొక పాత్రగా మరో ఫిలిములో కూడా ఆమెని తెర యెక్కించివెయ్యడమేనా?

దుఃఖం—కసి—అభిమానం—చిన్నతనానికి తోడు ఇన్ని భావవేగాలు కల్లోలపెట్టడంవల్ల వల్లమాలిన కంగారు.

ఇవీ కమల లక్షణాలు.

మరి పుష్పవల్లి ప్రకృతి?

పుష్పవల్లి రూపొందిన వుత్సాహం అంటే చాలదు. కులాసా అన్నా చాలదు. చలాకీ అంటే కొంచెం సరిపోవచ్చు.

గాఢాలోచనా, గాంభీర్యమూ ఆమెకి చుక్కెదురు. ఆమె కరుణరసం అభినయించలేదు. అభినయిస్తే ద్రష్టలకు నవ్వు వస్తుంది.

వచ్చింది కూడానూ.

శృంగారం ఆమె అభినయించగలదు.

కోపమున్నూ కనబరచగలదు.

అయితే, అది ప్రణయకోపం అయిమాత్రం వుండాలి.

ఈఫిలిముకి సంబంధించినంతవరకూ కమల జీవితంలో యివి లేవు.

కనకనే కమలపాత్రకు పుష్పవల్లి తగివుండలేదు.

కమల కాక ఆమె సుభద్ర అయి వుంటే?

౮

ఇక బసవరాజు సంగతి.

ఇతను లింగరాజు దత్తుడు.

కావడంవల్ల యీకథకు వచ్చిన విశిష్టత యేమిటీ?

కాకపోతే పోయేదిన్ని యేమిటీ?

మొదటి పెళ్లాం ఏకైకపుత్రుడంటే యేం?

అసలు, నాటకకర్త యీ ప్రతిపాదనకు సార్థక్యం కలిగించలేదు.

ఫిలిముకవి కిది తోచలేదు.

డైరక్టరుకి అందనే లేదు.

పోతే,

పాత్రకి తగిన నటుడు.

పెట్టిన పని చక్కగా నిర్వహించుకున్నాడు.

కాని, యీ పాత్రనిర్మాణంలో కూడా డైరక్టరు లోపం చాలా హెచ్చుగా వున్నది.

అసలీ ఫిలిములో వున్న ప్రధానలోపమే యిది.

దీని తరవాతివే తతిమ్మా వన్నీని.

దీన్నిబట్టి చూస్తే, డైరక్టరు సాహిత్యవేత్తృత సందేహాస్పదంగా కనపడుతుంది.

రికార్డింగు చక్కగా వున్నపుడు—ఫోటోగ్రాఫీ కూడా ముద్దుగా వున్నపుడు—సెట్టింగులున్నూ చాలా మట్టుకి బాగానే వున్నపుడు — అడ్వరుటయిజు మెంటు నైపుణ్యం కూడా అతిమాత్రంగా వున్నపుడు కథ యిలా వుందంటే యిక చెప్పవలసిన దేమి వున్నదీ?

అయితే,

రికార్డింగు యంత్రసాధ్యం.

ఫోటోగ్రాఫీసైతం అంతే.

ఆయంత్రాలు సరిగా అమర్చిపెడితే చివరిదాకా అవి యేక టాకీనే పని చేస్తాయి.

కాకపోయినా వాటిని నడపడానికి ప్రత్యేకనిపుణు లుంటారు.

సెట్టింగులకున్నూ ప్రత్యేకంగా ఆర్టిస్టూ శిల్పి వుంటారు.

కనక అవి చక్కగా వున్నా యంటే ఆప్రశంస వారికే వెడుతుంది.

అలాంటివారిని సంపాదించడంలో డైరక్టరు ప్రతిభ లేదూ అంటే వున్నది.

అయితే, ఆప్రతిభ, సరియైన కవిని సంపాదించడంలో యేమయి పోతుందీ?

దీన్నిబట్టి తేలుతున్న దేమంటే!

తెనుగు ఫిలిముల డైరక్టర్లకు కవి అంటే సదభిప్రాయం లేదు. లక్ష్యమున్నూ లేదు.

కథా, సంభాషణా రాయడాని కెవరైనా పనికివస్తారు. చాలా చోట్ల భాషాంతరీకరణానికే యీ కవులు నియోగించబడుతూ వుంటారు.

ఇక ప్లాటూ?

అది డైరక్టరు ప్రసాదమే.

దానికి తిరుగు లేదు.

గత్యాగత్యా యీరాయి ధర్మ మంచి కవికే—సమర్థుడైన కవికే తగులుతుం దనుకుందాం.

తెనుగు ఫిలిములలో వొకటిరెండింటి కలా తగిలి కూడా వుంది.

కాని యేమి లాభమూ?

ఆకవి కల్పించిన ప్లాటు యథా మాతృకగా తెర యెక్కదు.

ఆకవి సమకూర్చిన సంభాషణ కూడా యథాతథంగా రికార్డు కాదు.

అవి దిద్దబడతాయి.

తల్లకిందులుగా దిద్దబడతాయి.

కారణం?

నటీనటులలో అనేకులకు కొనిభాగాలు తప్ప అక్షరజ్ఞానం లేకపోవడం కొంత.

వాఙ్మయనిర్మాణం అంటే యేమిటో యెరగని డైరక్టరు నిరంకుశత్వం కొంత.

మొత్తానికి కవికి స్వాతంత్ర్యం లేదు.

తెనుగు ఫిలిముల డైరక్టర్ల దృష్టిలో నిరుపయోగమైన భగవత్సృష్టి వొక్క కవి మాత్రమే.

ప్రకృతం, ఫుల్లయ్యగారి ఫిలిములు — సత్యనారాయణవ్రతంలోనూ, మోహినీభస్మాసురంలోనూ, యీ వరశుల్కంలోనూ కూడా యీవిషయం రుజువవుతున్నది.

ఇక కథల్లో యెగుడు దిగుడు లున్నా యంటే—పూర్వాపర సందర్భాలు కలవలే దంటే—కథ యొక్క ఆయువుపట్టే గుర్తించబడలే దంటే వింత పడవలసిన దేమున్నదీ?

కట్నంకోసం, తన తండ్రి తనకి సంతలో పశువుకి లాగ వేలం పాట పెట్టాడని బసవరాజు చాలా పరితపించాడు.

కోర్టులో, కమల "ఆఅబ్బాయిని మేము కొనుక్కున్నా" మంటే సిగ్గుపడి గావా తీసేసుకున్నాడు.

కాని తన తండ్రి అనవసరంగా చచ్చిపోవడం ద్వారా తనకి పెత్తనం వచ్చాక కూడా వరశుల్కం తాలూకు సొమ్ము అత్తవారి కిచ్చెయ్యలేకపోయాడు.

ఇంతకంటే అసందర్భం దేమున్నదీ?

కాళిందికి తన యింటి ఆవరణలో స్టాట్యూ వేయించాడు.

తన భార్య కమలతో వెళ్లి ఆస్టాట్యూని గౌరవించాడు.

అయితే, తాను అత్తవారి యింటికి వెళ్లవలసిన అవసరం లేదనీ, తన భర్తే తనయింటికి వచ్చి తనతో కాపరం చెయ్యాలనీ, కమల కోర్టులో వాదించి డిక్రీపొందిందే?

అలాంటి కమల యిలాంటి పరిహారం లేకుండా అత్తవారి యింటి కెలా వెళ్లిందీ?

వరశుల్కం దురాచారమని యువకులకు బుద్ధి రావాలన్నా యీసొమ్ము తిరిగి యిప్పించి వెయ్యాలే?

కమల తెలివితేటలు కన్యలకు ఆదర్శంగా వుంటాయన్నా ఇంది యిలా జరిపించి తీరాలే ?

ఏదీ ?

ఇలాంటిది లేకుండా చివర పాటలు పాడుకుంటూ ఊరేగితే యేమి ప్రయోజనమూ ?

అది కథకి మాత్రం యేమి పుష్టి కలిగించినదీ ?

తండ్రి దగ్గిర పల్లమాలిన భయం. అంచేత, బసవరాజు లింగరాజుతో తరుచు మాట్లాడడు.

ఇక అతని కంపెనీ యెవరూ ?

సవతి తల్లి తప్ప మరి సరమానవు డెవడూ లేడా ?

అతను కాలేజీ విద్యార్థే ?

విద్యార్థులలో అనేకు లతనికి మిత్రు లుంటారే ?

సన్నిహితులు కూడా వుంటారే ?

కథలో వారిని ప్రవేశపెట్టవలసిన అగత్యం లేదూ ?

పేలంపాట జరగనిచ్చినందుకూ, కాళింది చనిపోయే పరిస్థితి కలగనిచ్చినందుకూ మిత్రు లొకరిద్ద రయినా అతన్ని హేళనచేసి వుండవద్దూ ?

విద్యార్థిమిత్రు లతని పెళ్ళికి వచ్చి లింగరాజు అసహ్యకృత్యాలకు అసంతృప్తి వెల్లడించి బసవరాజుని నిందించవద్దూ ?

కమల కాపరానికి రానన్నతరవాత, కోర్టులో దావాపడే లోపునా మిత్రు లతనికి సలహాలు చెప్పవద్దూ ?

ఏకాంతవాసం విధించుకొన్న కైదీలాగ అతన్ని చిత్రించడంలో యేమి వివేకం వున్నదీ ?

ఒకమా టతను సవతి తల్లితో "నీలసరా వుంది కనక నేను వియోగబాధ సహించగలుగుతున్నా" నన్నాడు.

ఇది అపార్థం కలిగించడం లేదూ ?

ఎటు చూచినా, బసవరాజు పాత్ర యిలాగ అసందర్భంగా వుంది.

మొత్తానికి కమలపాత్రా, బసవరాజు పాత్రా కూడా యిలాగ అసంపూర్ణంగానూ, నిరర్థకంగానూ తయా రయిపోయాయి.

డైరక్టరు దృష్టిలో పంటుబ్రాహ్మడికీ, దళారీ పేరయ్యకీ వుండినంత విలవ కమలకీ, బసవరాజుకీ లేకపోయింది.

ఇక లింగరాజు పాత్రను గురించి కొంచెం ఆలోచింతాం.

(సశేషం)

ప్రబుద్ధాంధ్ర సరస్వతీ మందిరం

౧ ప్రాథమికస్వత్వములు

గ్రంథకర్త సురవరము ప్రతాపరెడ్డిగారు బి. ఏ. బి. ఎల్. హైకోర్టు వకీలు. హైదరాబాదు. ప్రకాశకులు—వట్టికోట ఆళ్వారుస్వామిగారు, దేశోద్ధారక గ్రంథమాల, ఇసాంబావివీధి, సికిందరాబాదు, దక్కను. పేజీలు ౫౦. వెల ౦—౫—౦ ప్రజల ప్రాథమిక స్వత్వాలకు సంబంధించిన ప్రపంచచరిత్ర అంతా యిందులో కొద్ది పేజీలలోనే రివ్వున తిప్పి వెయ్యబడ్డది. ఇంగ్లాండు, ఫ్రాన్సు, రష్యా, అమెరికా, స్విట్జర్లాండు వంటి ఖండాంతరదేశాలలో జనుల జన్మహక్కు లెంత చక్కగా కాపాడబడుతున్నవో, బ్రిటిషుఇండియాలో మనమూ, దేశీయసంస్థానాలలో కల్లా నైజాము రాష్ట్రంలో మన వాళ్ళూ ఆవిషయంలో యెంత నికృష్టస్థితిలో వున్నామో ఈచిన్ని గ్రంథంలో చాలా వివరంగా తెలుపబడ్డవి. ప్రజ లందరూ—ముఖ్యంగా నియంతల దృష్టిలో పురుగుల కంటే నికృష్టు లయి వున్న కాంగ్రెస్సు ముఖ్యు లందరూ చదవతగ్గ గ్రంథం యిది. రెడ్డిగారి పరిశ్రమ చరితార్థం అనడాని కేమీ సందేహంలేదు.

౨ హైందవధర్మవీరులు

గ్రంథకర్త సురవరము ప్రతాపరెడ్డిగారు. బి. ఏ. బి. ఎల్. హైకోర్టు వకీలు హైదరాబాదు. ప్రకాశకులు—వట్టికోట ఆళ్వారుస్వామిగారు. దేశోద్ధారక గ్రంథమాల. ఇసాంబావివీధి-సికిందరాబాదు. పేజీలు ౬౪. వెల ౦—౬—౦ దీనికి శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు పరిచయవాక్యాలు వ్రాశారు. అసహాయశూరు లైన ౧౪ యోధుల సాహసకృత్యాలు ఇందులో వర్ణించబడ్డాయి. చక్కని గ్రంథం. అయితే, ముగ్గురు ఆంధ్రశూరులు మాత్రమే యిందులో కనపడుతున్నారు. ఇది గ్రంథకర్తకు ప్రశంసాకారణం కాదు. రెండో కూర్పులో సవరణ జరుగుతుం దని నమ్ముతున్నాను.

శ్రీ. సు. శాస్త్రి

3 తోరణము

గ్రంథకర్త—మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు. ప్రకటన—ఆంధ్రకుటీరం- పల్లెపాలెం, ఇంజరంపోస్టు. గోదావరిజిల్లా. పేజీలు ౪౦ వెల తెలపదు. ఇది ఆధునికపద్యకావ్యము. పల్లెపాలెంలోని ఆంధ్రకుటీరం పూచిన "తొలిపువ్వు" ఈ పూవు సువాసన గలిగి పాఠకులహృదయాల నాకర్షించగల సౌందర్యాన్నికూడా ప్రోగుచేసికొన్నది. ఈ కవి ముద్దైన విషయాన్ని వస్తువుగా ఎన్నుకుంటాడు. రసోచితములైన పదాలతో పద్యాన్ని చక్కగా కూర్చి పాఠకుని కందిస్తాడు. ధారాళమైన నడకగల వీరి పద్యాలు చదవడానికి ఇంపుగా ఉన్నవి. వీరి కవితాశక్తిని చూపడానికి "గాజు కన్నైన నొక యశ్రుకణము రాల్చు" ననే చరణం చాలు. కావ్యం చిన్నదైనా వివిధవిషయాలతో నిండిఉన్నది. "మదివగు" లోని పరాచికం హృదయంగమంగా ఉన్నది. "పితృశిక్ష" లో కవిత్వంకన్నా నీతిబోధ ఎక్కువగా కనబడుతున్నది. "మాదొడ్డ తరుణము" మొదలైన ప్రయోగాలను గ్రహించడంచేత వీరికి జీవద్భాషమీదగల అభిమానం వ్యక్తమౌతున్నది. వీరేదైనా పెద్ద కావ్యం వ్రాస్తే వీరి కవిత్వమింకా రాణిస్తుందని నా అభిప్రాయం.

కో. వే. సు.

మద్రాసు ప్రెసిడెన్సీలో

కులాల ననుసరించి హిందువులు (౧౯౩౧ జనాభా)

జిల్లా	హిందువుల మొత్తం సంఖ్య	బ్రాహ్మణులు	బ్రాహ్మణేతరులు	వెనకబడ్డకులాలు
౧ మద్రాసు	౫,౨౦,౧౬౧	౫౮,౭౬౧	౩,౭౬,౪౯౪	౮౪,౯౦౬
౨ చిత్తూరు	౧౩,౫౬,౩౮౪	౨౦,౭౦౫	౧౧,౯౦,౬౫౨	౨,౪౫,౦౨౭
౩ నెల్లూరు	౧౩,౧౭,౪౨౦	౩౬,౬౭౦	౧౦,౧౮,౯౪౦	౨,౬౧,౮౧౦
౪ గుంటూరు	౧౬,౩౯,౮౩౪	౮౪,౦౧౫	౧౩,౯౨,౫౯౭	౧,౬౩,౨౨౨
౫ కృష్ణా	౧౦,౮౯,౫౨౩	౫౭,౯౧౫	౮,౨౮,౮౧౩	౨,౦౨,౮౦౫
౬ పశ్చిమగోదావరి	౧౧,౩౪,౫౬౦	౪౮,౦౦౯	౮,౩౬,౦౭౫	౨,౫౦,౪౭౬
౭ తూర్పుగోదావరి	౧౮,౫౫,౪౩౯	౭౯,౪౫౦	౧౩,౮౮,౬౧౨	౩,౮౭,౩౮౭
౮ విశాఖపట్నం	౩౪,౦౦,౯౨౨	౬౬,౧౦౯	౨౯,౭౨,౪౬౮	౩,౬౨,౩౪౫
౯ గంజాం	౨౨,౦౧,౭౦౦	౧,౫౪,౯౨౯	౧౭,౩౮,౭౮౪	౩,౦౭,౯౮౭
౧౦ కర్నూలు	౮,౦౫,౦౩౨	౧౪,౯౯౬	౬,౭౮,౩౦౬	౧,౧౧,౭౩౦
౧౧ కడప	౭,౮౮,౧౯౨	౧౧,౮౫౧	౬,౬౪,౭౯౯	౧,౧౧,౫౪౨
౧౨ అనంతపురం	౯,౪౩,౭౬౮	౧౮,౬౪౦	౭,౮౪,౦౬౬	౧,౪౧,౦౬౨
౧౩ బళ్లారి	౮,౫౭,౪౨౫	౧౬,౬౬౨	౭,౩౧,౮౯౪	౧,౦౮,౮౬౯
౧౪ చెంగల్పట్టు	౧౫,౭౬,౧౩౭	౩౫,౬౯౪	౧౦,౭౨,౪౭౦	౪,౬౭,౯౭౩
౧౫ ఉత్తరార్కాడు	౨౦,౭౮,౨౨౨	౩౩,౫౪౫	౧౬,౩౯,౫౪౭	౪,౦౫,౧౩౦
౧౬ సేలం	౨౩,౪౮,౩౨౫	౩౦,౭౩౮	౧౯,౯౩,౩౪౫	౩,౨౪,౨౪౨
౧౭ దక్షిణార్కాడు	౨౩,౦౧,౫౧౩	౩౭,౧౩౩	౧౬,౧౫,౯౧౩	౬,౪౮,౪౬౭
౧౮ కోయంబత్తూరు	౨౩,౪౧,౬౬౭	౩౯,౭౫౫	౧౯,౫౧,౯౪౭	౩,౪౯,౯౬౫
౧౯ తంజావూరు	౨౧,౪౮,౦౧౮	౧,౩౩,౫౫౦	౧౪,౯౧,౦౦౭	౫,౨౩,౪౬౧
౨౦ తిరుచునాపల్లి	౧౭,౩౭,౧౦౫	౫౪,౦౦౯	౧౩,౫౧,౫౨౯	౩,౩౧,౫౬౭
౨౧ మధుర	౨౦,౨౧,౩౩౬	౩౩,౭౬౬	౧౬,౪౫,౮౨౭	౩,౪౧,౭౪౩
౨౨ రామ్నాడు	౧౬,౧౮,౭౪౩	౩౯,౮౦౩	౧౩,౧౧,౮౧౪	౨,౬౮,౧౨౬
౨౩ తిరునల్వేలి	౧౬,౯౮,౯౫౦	౫౩,౩౫౮	౧౩,౧౬,౩౫౩	౩,౨౯,౨౩౯
౨౪ నీలగిరి	౧,౩౧,౦౫౩	౧,౮౧౪	౯౮,౮౭౬	౩౦,౩౬౩
౨౫ మలబారు	౨౩,౦౩,౭౫౪	౬౦,౬౧౨	౧౮,౮౩,౩౦౯	౩,౫౯,౮౨౩
౨౬ దక్షిణకనరా	౧౦,౬౧,౧౮౭	౧,౨౯,౩౨౫	౭,౮౩,౦౧౨	౧,౪౮,౮౫౦
	౪,౧౨,౭౭,౩౭౦	౧౩,౪౭,౮౧౪	౩,౨౬,౫౭,౪౩౯	౭౨,౬౮,౧౧౭

౧౦౮ వ పేజీ తరవాయి

యాల్లో నిర్మాణ కార్యక్రమంలోనూ, సత్యాగ్రహ సమయాల్లో ఉత్తేజం కలిగించే కార్యక్రమంలోనూ గూడా ఖద్దరు ఉద్యమం అనన్యసాధారణమైన స్థానం వహించి ఉండినది. ఆ సేతు హిమాచల పర్యంతమూ, ప్రతీసభలోనూ, ప్రతీజాతీయ పత్రిక ద్వారానూ ఖద్దరుద్యమం ప్రబోధించబడింది. బ్రిటిషుసామ్రాజ్యపతనానికీ, భారత స్వరాజ్యప్రాప్తికీ ఖద్దరుధారణ అవశ్యకమని ప్రజల్లో అసదృశమైన ప్రచారం చేశారు. ఫలితం? ఉద్యమం మొదట్లో యెట్లా ఉండో నేటికీ అట్లాగే ఉంది. కాగా స్వదేశవస్తు ప్రోత్సాహంవల్ల దేశంలో బట్టలమిల్లుల విపరీతంగా పెరిగిపోయి లాంకషైరు మిల్లులతో పోటీ చెయ్యడమే కాకుండా సీమబట్టల దిగుమతులను ౬౦ కోట్లనుంచి ౯ కోట్లకి తగ్గించాయి, విదేశవస్తు బహిష్కారానికీ, స్వదేశవస్తు వ్యాప్తికీ ఖద్దరునే సాధనంగా తీసికొన్నప్పటికీ, లాంకషైరు పతనానికి కారణం యిండియాబట్టల మిల్లులు కాని ఖద్దరు కాదన్న సంగతి గమనించతగ్గది. దీనివల్ల గృహపరిశ్రమల్నే జాతీయపరిశ్రమలుగా మార్చాలన్న ఉద్యమం ప్రవాహానికి ఎదురీదడం అన్న సంగతి విశదం కావడం లేదా?

ఇంక సిద్ధాంతాల విషయం విచారిద్దాం. ఒక చెంపమీద కొడితే మరొక చెంప చూపించు. త్రికరణములా అహింసా సిద్ధాంతాల్నే అవలంబించు. సత్యాన్ని సాధించేనిమిత్తం ఆత్మార్పణానికేనా వెనుదీయకు' యివీ గాంధిగారి ఉపదేశాలు. ప్రజలు యీ ఆశయాలకు బద్ధులైఉంటే నిజంగా రామరాజ్యం ఏర్పడితీరుతుంది. అందరూ త్యాగధనులే అవడంవల్ల యుద్ధాలు మానవలోకంలోనుంచి తొలగిపోతాయి.

అయితే అట్టి పరివర్తన జరగడం—అందులోనూ ప్రస్తుతమానవ సంఘంలో—సాధ్యమా? ఏమీలేనివాళ్లే ఏచిక్కుల్లో దుముకడానికైనా సాహసిస్తారన్న విషయం నిర్వివాదం. భాగ్యవంతులు అట్లా దిగితే అర్థికంగా వారికి అనేక చిక్కులు గలుగుతాయి. అందుచేత వారికి యెప్పుడూ వెనకచూపే ఉంటుంది. అటువంటివారు సత్యానికైతేమాత్రం ఎట్లా ఆత్మార్పణ చెయ్యగలరూ? అంటే వారింకా సత్యాగ్రహులు కాలేకపోయారు. వారిహృదయాలని సత్యాహింసలు పునీతంగా చెయ్యలేవు. అటువంటిస్థితిలో వారిచేత అస్త్రసన్యాసం చేయించినా మానసిక దౌర్జన్యం మాపుచేయించలేముగదా? తగిన అవకాశం లభించగానే స్వార్థంనిమిత్తం వారు దౌర్జన్యానికి సిద్ధపడకపోరు.

ఇంతకీ యుద్ధాలికి కారణం రక్తపాతమునందు ఆసక్తి ఉండి కాదు. మానవుల్లో కనికరము లేక కాదు. సత్యాహింసలయందు ఆదరణభావము లేకనున్నా కాదు. కేవలం వ్యక్తిగతమైన ఆస్తి వుండడమే దానికికారణం. దానిలోంచే లోభమూ, అసహనమూ ఉద్భవించాయి. అదే దౌర్జన్యానికి కారణం. అందులోనే రక్తపాతం యిమిడివుంది. ఈసత్యాన్ని ఎవ్వరూ మరుగుపరచలేరు.

వ్యక్తిగతమైన ఆస్తిని నిర్మూలం చెయ్యాలన్న సిద్ధాంతంవల్లనే రష్యాలో సామ్రాజ్యం ధనికప్రభుత్వం అంతరించిపోయినాయి. విశ్వమానవ సౌభ్రాతృత్వానికి సరియైన పునాదులు ఏర్పడ్డాయి.

ఇవన్నీ యిలా ఉండగా సుమారు ౨౦ సంవత్సరాలనుంచీ దేశం తన సిద్ధాంతాలను అనుసరించినా, నేడు దేశంలో అవినీతి పెచ్చుపెరిగి ఉందనీ, సత్యాహింసలయందు త్రికరణయా విశ్వాసం ఉంచన్న సభ్యులు గలిగిన కాంగ్రెసు నాలిస్యంతో కుళ్ళిపోయివుందనీ గాంధిగారే చెప్పుతున్నారు. తీవ్రంగా మళ్లీ సత్యాగ్రహ సమరం సాగించడానికి దేశీయుల్లో అర్హత లేదనికూడా ఆయన చాటుతున్నాడు. కేవలం త్యాగంమీనే ఆధారపడివున్న సేనావాహినికే అట్టి దుస్థితిపట్టినప్పుడు అధికారం చేజిక్కినప్పుడు మరింత కలుషం గాకుండా ఉంటుందా ఆసంస్థ? ఈ భావప్రకటన గాంధీజం యొక్క పరాజయాన్ని అంగీకరించడం కాదా?

కాగా యెన్ని విధాలుగా తరచి చూచినా గాంధిగారి ఆశయాలు నెరవేరడానికి ఆయన సూచించిన మార్గం అవకాశం గలుగచెయ్యదని తేలింది. గాంధీజం మానవకల్యాణానికి నూతన సందేశం యివ్వలేకపోయింది.

హిందీ ముప్పు తెచ్చిపెడుతుంది

హిందీప్రాతికూల్యం తగ్గిపోతుందని ప్రధానమంత్రిగారు నమ్మారు.

హిందీనిర్బంధం తొలిగిపోతుందని హిందీప్రతికూలురు నమ్మారు.

కాని మేము రెండూ నమ్మలేదు

ఎందుచేత నంటే?

హిందీనిర్బంధానికి కారణం గాంధిగారి ఆజ్ఞ.

హిందీప్రాతికూల్యానికి హేతువు మాతృభాషాభిమానం.

అది జవదాటితే రాజగోపాలాచారికి పదభ్రంశం.

ఇది చూపించుకోకపోతే హిందీప్రతికూలురకు మాతృద్రోహం.

కనక రెండూ అనుల్లంఘ్యాలే.

పాఠశాల మూసివెయ్యడంవల్ల పికెటింగుకి అగత్యం లేని రోజుల్లో పెద్దకబుర్లు చెబుతూ రాజగోపాలాచారిగారు హిందీప్రతికూలురను విడిచిపెట్టించారు.

తేనె తీపే గాని కత్తికోత తప్పకపోవడంవల్ల, పాఠవారు కలిసిరాగా పాఠశాల తెరిచిన నాడే మొదలుపెట్టి హిందీప్రతికూలురు ద్విగుణీత్సాహంతో మళ్లీ పికెటింగు సాగిస్తున్నారు.

చమత్కారమైన సన్నివేశం యిది.

గాని, గాలికి కొట్టుకు వచ్చిన పర—క్షుద్రభాష నేర్చుకుతీరాలని నిర్బంధశాసనమా?

మాతృభాషను రక్షించుకోబోతే కైదు శిక్షా?

ధిక్ కాంగ్రెస్!

జస్టిసు ప్రభుత్వమూ సైతాను ప్రభుత్వం, కాంగ్రెసు ప్రభుత్వమా?

సరస్వతీగ్రంథమండలి

కంభంవారి సత్రము వీధి *** రాజమహేంద్రవరము

నవలలు_నవరసభరితములగు నవలలు_ముచ్చటగూర్చు అచ్చుతో—ముద్దులొలుకు క్యాలికో బయిండుతో_రెండుమాసముల కొక్కచక్కని నవల. నడుమ నడుమ చిన్నచిన్న అనుబంధగ్రంథములు వెలువడుచుండును. చందాదారులకు ప్రవేశరుసుము రు 0-4-0 చందాదారులు ఒకేసారి రు 7-8-0 లు ముందుగా పంపినచో వరుసగా ఆరుపుస్తకములు అన్‌రిజిస్టర్డు పార్శిలుగా పంపుదుము.

ఇంతవరకు వెలువడిన గ్రంథములు

11 ప్రేమసుందరి	1 8 0	26 జాగిలము	1 8 0	41 చిన్నహస్తము (2వ భాగము)	1 8 0
12 చోరశిఖామణి	1 8 0	27 మొగలాయీదర్బారు 2 భా॥	1 8 0	42 కంకణరహస్యము	1 8 0
13 లక్ష్మీప్రసాదము	1 8 0	28 సరస్వతి	1 8 0	43 సంజీవి (1వ భాగము)	1 8 0
14 హత్యారహస్యము	1 8 0	29 ఆనందాభాయి	1 8 0	44 సంజీవి (2వ భాగము)	1 8 0
15 ఫాస్టు (1వ భాగము)	1 8 0	30 హత్యాన్వేషణము	1 8 0	45 వ్రజరాణి	1 8 0
16 ఫాస్టు (2వ భాగము)	1 8 0	31 మొగలాయీదర్బారు 3 భా॥	1 8 0	46 హత్యాభ్రమ	1 8 0
17 కుముద్వతి	1 8 0	32 గంగ	1 8 0	47 కాశీఖండము	1 8 0
18 చిన్నకోడలు	1 8 0	33 మొగలాయీదర్బారు 4 భా॥	1 8 0	48 సేవాశ్రమము (1వ భాగము)	1 8 0
19 రహస్యభేదనము	1 8 0	34 కోహినూరు	1 8 0	49 సేవాశ్రమము (2వ భాగము)	1 8 0
20 సింహగడము	1 8 0	35 ఆటిన్ మణోలా	1 8 0	50 నాసీకన్య	1 8 0
21 మణిహారము	1 8 0	36 అపరిచిత	1 8 0	51 స్త్రీసాహసము ప్రథమభాగము	1 8 0
22 మొగలాయీదర్బారు 1వ భా॥	1 8 0	37 అంతఃపురము (1వ భాగము)	1 8 0	52 స్త్రీసాహసము 2వ భాగము	1 8 0
23 ఘటనాచక్రము	1 8 0	38 అంతఃపురము (2వ భాగము)	1 8 0	53 మేరీరాణి	1 8 0
24 రాజసుందరి	1 8 0	39 అగ్రహారము	1 8 0	54 రాజ్యలక్ష్మి	1 8 0
25 కుంకుమభరణి	1 8 0	40 చిన్నహస్తము (1వ భాగము)	1 8 0	55 లీల	1 8 0

అనుబంధములు

1 నృత్యతరంగిణి	0 12 0	10 శ్యామల	1 0 0	19 కథావళి	1 0 0
2 అభాగిని	0 12 0	11 కొంతం కథలు (చిన్నకథలు)	1 0 0	20 నాలుగుకథలు	1 0 0
3 ఛద్మవేషి	[illegible] 12 0	12 కాలసర్పి	1 0 0	21 నీతిప్రబోధిక	1 0 0
4 విదురుని యుపదేశములు	[illegible] 0 0	13 భారతకథాసారం	1 0 0	22 ఆదర్శము (1వ భాగము)	0 12 0
5 కాంచనమాల	[illegible] 0	14 కథాకల్పవల్లి (చిన్నకథలు)	1 0 0	23 ఉదంకుడు	0 12 0
6 సీమంతిని	1[illegible] 0	15 అరక్షణీయ	1 0 0	24 భేతాళకథలు	0 12 0
7 సుశీల	1 [illegible] 0	16 మాధవి	1 0 0	25 దయ్యాలు	0 12 0
8 శశిరేఖ	1 [illegible] 0	17 లలిత	1 0 0		
9 యమునాబాయి	1 [illegible]	18 పెండ్లిదండ	1 0 0		

నాటకములు

1 మార్కండేయ	0 12 0	5 హాజవాను	1 0 0	9 దంపతులు	1 0 0
2 అహల్యాశాపవిమోచనము	0 12 0	6 నూర్జహాను	1 0 0	10 విజయవిజయం	1 0 0
3 మోహారుపతనము	1 0 0	7 దుర్గాదాసు	1 0 0	11 భక్తకుచేల	1 0 0
4 వరమాల	1 0 0	8 చంద్రగుప్త	1 0 0		

ఈ పుస్తకాలు రాజమండ్రీ కలాభివర్ధనీ పరిషత్తులోకూడా దొరుకును